
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY

నల్లగొండ

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.131	210	240
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 । కనిష్ఠం 18.8



కనికరించని నిర్మలమ్మ

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ శనివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి జిల్లావాసుల ఆశలపై నీళ్లు చల్లింది. ఉమ్మడి జిల్లాకు కేంద్రం నుంచి ఆశించిన ఏ పథకం, ప్రాజెక్టు గురించి బడ్జెట్ ప్రసంగంలో కనీస ప్రస్తావన లేకపోవడం నిరాశ కలిగించింది. ప్రత్యేక పథకాల ప్రస్తావన లేకపోయినా, ఆదాయపన్ను సవరణలు, స్వయం సహాయక సంఘాలు, అర్బన్ పేదలకు క్రెడిట్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయించడం, గిగ్‌వర్కర్లకు శ్రమ్‌పోర్టల్ ద్వారా కార్డుల పంపిణీ, ఆరోగ్యబీమా వర్తింజేయాలనే నిర్ణయాలు కొంత ఊరట కలిగించాయి. అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు తీసుకోవాలనే కేంద్ర నిర్ణయంపై కూడా హర్షం వ్యక్తమైంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

- ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ప్రత్యేక కేటాయింపులే లేవు
- పేద, మధ్యతరగతి వర్గాలకు ఊరటనిచ్చిందని పలువురి అభిప్రాయం
- కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమస్పందన

పేద, మధ్యతరగతివర్గాలకు, వేతన జీవులకు ఊరటకలిగేలా ఆదాయపన్ను రాయితీ పరిధి పెంచడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వ్యక్తిగత ఆదాయపన్నును రూ.12లక్షల వరకు మినహాయించారు. స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపి రూ.12.75 లక్షల వరకు ఈ పన్ను మినహాయింపు ఉంటుంది. దీంతో పేద, మధ్యతరగతివర్గాలకు కనీసం రూ.70వేల వరకు ఏటా లబ్ధి చేకూరనుంది. దీంతో వ్యాపారులతో పాటు ఉమ్మడి జిల్లాలోని 60వేల మంది ఉద్యోగులకు ఇది ఊరటనిచ్చే అంశం. వీరితో పాటు పట్టణాల్లో నివసించే మధ్యతరగతివర్గాలకు అద్దెలపై వచ్చే ఆదాయంపై రూ.6లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు లభించింది.

తగ్గనున్న మొబైల్స్, ఎల్సీడీల ధరలు

సుంకాలు తగ్గించడంతో మొబైల్ ఫోన్లు, ఎల్సీడీలు, ఎల్ఈడీలు, ఎలక్ట్రిక్‌వాహనాలు, క్యాన్సర్ ఇతర ప్రాణాంతక ఔషధాలు, లెదర్ వస్తువులు, దేశీయంగా ఉత్పత్తి అయ్యే...

- మిగతా 8వ పేజీలో...



కొంతమోదం, కొంత ఖేదం

కేంద్ర బడ్జెట్ మిశ్రమంగా ఉంది. కొన్ని వర్గాలకు ఊరట కలిగిస్తే, మరికొన్ని వర్గాల గురించి కనీస ప్రస్తావన కరువైంది. ఆదాయపన్ను పరిమితిని రూ.12లక్షలకు పెంచడం మధ్యతరగతి వర్గాలకు ఊరట కలిగించే అంశం. మానవ వనరులను పెంచే విద్య,వైద్య రంగాలకు కేటాయింపుల్లో కేంద్రం వివక్ష చూపింది. మొత్తం బడ్జెట్‌లో విద్యారంగానికి 2.54శాతం, వైద్య రంగానికి 1.94శాతం మాత్రమే కేటాయింపులు చేయడం శోచనీయం. కొఠారీ కమిషన్ సిఫార్సులను కనీసం పట్టించుకోలేదు.

- డాక్టర్ అక్కినేపల్లి మీనయ్య, నల్లగొండ ఎకనామిక్స్ ఫోరం అధ్యక్షుడు



మధ్యతరగతికి ఊరట

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ మధ్యతరగతి, అల్పాదాయం, పారిశ్రామిక, వ్యాపారవర్గాలను దృష్టిలో పెట్టుకొని రూపకల్పన చేసినట్టు ఉంది. ఇటీవల కాలంలో మధ్యదిగువ తరగతి ప్రజల కొనుగోలు శక్తి బాగా దెబ్బతిన్నది. ఆ మేరకు పారిశ్రామిక ఉత్పత్తులు తగ్గి జాతీయ స్థూల ఆదాయం ఆశించినదానికంటే తక్కువగా నమోదైంది. దీంతో ఆర్థిక మంత్రి మధ్య, దిగువ తరగతి ప్రజల కొనుగోలు శక్తిని పెంచేలా కసరత్తు చేశారు. రూ.12లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం ప్రజలకు ఊరట కలిగించింది.

- పెద్దిరెడ్డి గణేష్, బ్యాంకింగ్‌రంగ నిపుణులు

చేనేత రంగంపై చిన్నచూపు

(ఆంధ్రజ్యోతి, మోత్కూరు): దేశంలో వ్యవసాయం తర్వాత చేనేత రంగం ప్రధానమైనది కాగా, కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపుల విషయంలో ఆర్థికశాఖ మంత్రి నిర్మాలా సీతారామన్ చిన్నచూపు చూశారు. పేరు చేనేతది, నిధులు టెక్స్‌టైల్‌కు అనేలా బడ్జెట్ ఉంది. టెక్స్‌టైల్ రంగానికి రూ.5,272 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. అందులో చేనేతకు కేవలం రూ.200కోట్లు మాత్రమే దక్కనున్నాయి. గత ఏడాది బడ్జెట్‌లోనూ చేనేతకు రూ.200కోట్లే కేటాయించారు. టెక్స్‌టైల్ రంగానికి బడ్జెట్ పెంచుతున్న ప్రభుత్వం చేనేత రంగాన్ని మాత్రం విస్మరిస్తోందని చేనేత సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చేనేతకు కేటాయించిన నిధులు ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతాయంటున్నారు. దేశంలో 1.83కోట్లు, రాష్ట్రంలో సుమారు 50వేల కుటుంబాలు, ఉమ్మడి జిల్లాలో సుమారు 15వేల కుటుంబాలు చేనేత పై ఆధారపడ్డాయి. చేనేతకు నిధులు పెంచకపోవడంతో ఈ రంగం మరింత సంక్షోభం లో కూరుకుపోయి రోడ్డున పడతామని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. చేతివృత్తులను కాపాడతామని చెబుతున్న మోదీ ప్రభుత్వం చేనేతరంగానికి నిధులు పెంచకుండా నిర్వీర్యం చేస్తోంది. చేనేత సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ చేనేత సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. బడ్జెట్‌లో చేనేత కార్మికులకు ఉపాధి, కనీస వేతనాల ఊసే లేదు. చేనేతకు రిజర్వ్ అయిన 11 రకాల వస్త్రాలను మిల్లుల్లో తయారు చేయకుండా అజమాయిషీ చేసే ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో ప్రభుత్వం పరోక్షంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థను నిర్వీర్యం చేసినట్టేనని చేనేత సంఘాల నేతలు విమర్శిస్తున్నారు.



నిధులు, రైల్వే కేటాయింపులే లేవు..



(ఆంధ్రజ్యోతి, యాదాద్రి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి న బడ్జెట్‌లో కొత్త ప్రాజెక్టులు రాకపోగా, పాత వాటికి నిధులు కేటాయించలేదు. ప్రధానంగా ఏళ్లుగా రైల్వే వ్యవస్థ ఆధునీకీకరణ, ఎంఎంటీఎస్ సేవల పెంపు కోసం ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. యాదాద్రి జిల్లా ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. భువనగిరి ఖిల్లాతోపాటు యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, జైనమందిరం, శైవాలయాలు, స్వర్ణగిరి దేవాలయాలు ఉన్నాయి. హైదరాబాద్ నగరానికి చేరువలో ఉండటంతో జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తారని ప్రజలు ఆశాభావంతో ఉన్నారు. అయితే కేంద్ర బడ్జెట్ జిల్లా వాసులను నిరాశపరిచింది. మూసీ నది కాలుష్యం కారణంగా పరివాహక ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూసీ నీటి శుద్ధీకరణకు కేంద్రం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుందని ఈ ప్రాంత ప్రజలు ఆశించినా నిరాశే మిగిలింది. జిల్లాలో చేనేత కార్మికులు అధికంగా ఉండగా, చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ ఎత్తివేస్తారని నేత కార్మికులు ఆశించగా, కేంద్రం మాత్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్మించనున్న రీజనల్ రింగ్‌రోడ్డుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. భూసేకరణ, రోడ్డు నిర్మాణ పనులు కేంద్రం నిర్ణయంతో ముందుకు సాగనున్నాయి. రైతులు పంట సీజన్ ప్రారంభంలో రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతుంటారు. రుణాలు లభించక వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేస్తున్నారు. అయితే కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు పంటల సాగు కోసం పెట్టుబడులు అవసరమైనప్పుడు అధిక వడ్డీతో అప్పులు చేయకుండా, తక్కువ వడ్డీకే రుణాలు పొందేందుకు కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5లక్షల వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలోని 2.50లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. తక్కువ ఉత్పాదక, పంట దిగుబడి మధ్యస్థంగా ఉండే వెనుకబడిన 100 జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం అందించేందుకు పీఎం ధన ధాన్య కృషి యోజనను కేంద్రం ప్రకటించింది. ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టనుండగా, రైతులకు ప్రోత్సాహకాలు అందనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో గోదాములు, నీటిపారుదల, రుణ కల్పన, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, పంచాయతీలు, నియోజకవర్గాల స్థాయిల్లో పండించిన పంటలను నిల్వ చేయడం ద్వారా రైతులకు లబ్ధి చేకూర్చడం దీని లక్ష్యం. పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంటుందని ఆశించినా, ప్రభుత్వం యథావిధిగా కొనసాగించింది. ఆదాయ పన్ను మినహాయింపుతో జిల్లాలో సుమారు 3వేల మందికి ప్రయోజనం చేకూరనుంది.

నల్లగొండలో నగరోత్సవం

- చెర్వుగట్టు జాతరలో నేడు మొదటి ఘట్టం



•8లో..

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్న అధికారులు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శనివారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల స్థానానికి, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ స్థానానికి ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం రాజకీయ నాయకులకు చెందిన హోర్డింగులు, జెండాలు, గోడ రాతలు, ఫ్లెక్సీ ప్రకటనలు తొలగించాలన్నారు. ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్, 10న నామినేషన్లు, 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13వ తేదీన ఉపసంహరణ, 27వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారని, మార్చి 3న ఫలితాలు వెల్లడిస్తారని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ స్థానానికి నల్లగొండ కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

వరంగల్- ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఆర్జాలబావి వద్ద ఉన్న వేర్ హౌసింగ్ గోదాములో ఏర్పాట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి వేర్ హౌసింగ్ గోదామును ఆమె పరిశీలించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రి సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లను పరిశీలించారు.

విధులకు నై, క్రికెట్ పోటీలకు సై

•8లో..

- దూటీకి డుమ్మా కొట్టి బ్యాట్, బాల్ పట్టిన 64మంది కార్యదర్శులు
- సాగర్ నియోజకవర్గంలో వెలుగులోకి
- పలువురికి షోకాజ్‌లు

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు తప్పిన బహిష్కరణ ముప్పు

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలకు ప్రైవేటు కళాశాలల బహిష్కరణ ముప్పు తప్పింది. ప్రాక్టికల్స్ పరీక్షా కేంద్రాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు జారీ చేసిన ఉత్తర్వులపై ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కన్నెర్ర చేశాయి. పరీక్షలకు 15 రోజుల ముందు జారీ చేసిన ఉత్తర్వులతో ఒక్కో ప్రైవేట్ కళాశాలపై రూ.80వేల ఆర్థిక భారం పడుతుంది. ఇప్పటికే మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండి కళాశాలల నిర్వహణ భారంగా మారింది.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్)



- ఏడాదిపాటు సీసీ కెమెరాల బిగింపు వాయిదా
- రేపటి నుంచి 22 వరకు ప్రాక్టికల్స్

అప్పులు చేసిన తమపై సీసీ కెమెరాల పేరుతో అదనపు భారం మోపవద్దని, ఈ నిబంధనను ఏడాదిపాటు వాయిదా వేయాలని నిరసనలు చేపట్టి ప్రాక్టికల్స్ పరీక్షల బహిష్కరణాస్త్రాన్ని కళాశాలల యాజమాన్యాలు ప్రయోగించాయి. దీంతో శనివారం హైదరాబాద్‌లో ఇంటర్ బోర్డు కమిషనర్‌తో జరిగిన చర్చల్లో సీసీ కెమెరాల బిగింపు మరుసటి ఏడాదికి వాయిదాపడింది. దీంతో సోమవారం నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు యథావిధిగా ప్రారంభం కానున్నాయి.

31,349 మంది విద్యార్థులు, 193 పరీక్షా కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలోని 271 ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలలకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్, ఒకేషనల్ కోర్సులు చదువుతున్న 31,349 మంది విద్యార్థులు ఈ ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ నెల 3 నుంచి 22వ తేదీ వరకు మూడు దఫాలుగా, రెండు పూటలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, తిరిగి సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. అందుకు 193 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అబ్జర్వర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. ప్రభుత్వ కళాశాలలన్నింటిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఎంపిక చేసిన ప్రభుత్వ యాజమాన్య కేజీబీవీ, గురుకుల తదితర సెక్టార్ కళాశాలలు, ప్రైవేట్ కళాశాలల్లో మరికొన్ని పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా మార్చి 5వ తేదీ నుంచి థియరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

సీసీ కెమెరాల బిగింపు వివాదం, పరిష్కారం వెనుక?

ఇంటర్ సైన్స్ కోర్సుల్లో ప్రాక్టికల్స్ అత్యంత విలువైనవి. తరగతి గదుల్లో నేర్చుకున్న పాఠ్యాంశాలపై ల్యాబ్‌లో చేసే ప్రయోగాలతో మరింత స్పష్టత, అవగాహన వస్తుంది. అంతేగాక పరిశోధనాసక్తి పెరిగే అవకాశం ఉంటుంది. ఈ మేరకు అన్ని కళాశాలల్లో ఫిజిక్స్.

- మిగతా 8వ పేజీలో...

జిల్లా	కళాశాలలు	పరీక్షా కేంద్రాలు	విద్యార్థులు
నల్లగొండ	132	107	16,800
సూర్యాపేట	74	44	8,349
యాదాద్రి	65	42	6,200
మొత్తం	271	193	31,349

పకడ్బందీగా ప్రాక్టికల్స్ పరీక్షలు



ప్రాక్టికల్స్ పరీక్షలకోసం పకడ్బందీ ఏర్పాట్లుచేశాం. అవకతవకలకు ఆస్కారం లేకుండా నిఘా పెట్టాం. 3 స్పెల్స్‌గా నిర్వహించే ప్రాక్టికల్స్ కోసం అబ్జర్వర్స్ తదితర నియామకాలు పూర్తి చేశాం. విద్యార్థుల ప్రతిభ ఆధారంగానే మార్కులు కేటాయించాలని నిర్దేశించాం. ప్రైవేట్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టాం. పరీక్షల నిర్వహణ, మార్కుల కేటాయింపులో అక్రమాలకు పాల్పడితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- రమణి, యాదాద్రి జిల్లా ఇంటర్ నోడల్ అధికారి

భక్తులకు అన్ని వసతులు కల్పించాలి



చెర్వుగట్టుపై జాతర ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్

చెర్వుగట్టుకు జాతరకు 3లక్షల మంది వస్తారని అంచనా

కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టు ఆలయ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అధికారులను ఆదేశించారు. నేటినుంచి చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల దృష్ట్యా ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. తొలుత వాహన పార్కింగ్, టికెట్, ప్రసాద కౌంటర్లు, కల్యాణ మండపం, క్యూలైన్, తలంబ్రాలు సమర్పించేందుకు భక్తులు వచ్చే క్యూలైన్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాలకు సుమారు 3లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేశామన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, అత్యవసర సేవలు 24గంటలు అందేలా చూస్తామన్నారు. సుమారు 1,500 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్టు తెలిపారు.

అంతకుముందు రామలింగేశ్వరుడి మూలవిరాట్టును కలెక్టర్, ఎస్పీ దర్శించుకోగా వారికి ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ వేదాశీర్వచనం చేశారు. వారి వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, ఆలయ ఈవో సిరికొండ నవీన్‌కుమార్, ఏసీ భాస్కర్, నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఆర్ఐ తరుణ్, తదితరులు ఉన్నారు. అదేవిధంగా చెర్వుగట్టు శివారులోని పోతులపాటి సోమశర్మ శివజ్ఞాన పీఠాన్ని కలెక్టర్, ఎస్పీ సందర్శించారు.

బాలకార్మికుల చేరదీత

ఆపరేషన్ స్మైల్ ద్వారా 99 మందికి విముక్తి

చిన్నారులను పనిలో పెట్టుకున్న 61మందిపై కేసు

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ స్మైల్-11వ విడత జిల్లాలో విజయవంతంగా నిర్వహించినట్లు ఎస్పీ శరత్ చంద్రపవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ డివిజన్లలో మూడు ప్రత్యేక బృందాలు బాలకార్మికుల కోసం తనిఖీలు నిర్వహించి జిల్లాలో మొత్తం 99మంది బాలకార్మికులను గుర్తించామని పేర్కొన్నారు. హోటళ్లు, ఇటుక బట్టీలు, బేకరీలు, మెకానిక్ షాపులతో పాటు వివిధ పనులు చేస్తూ వెట్టిచాకిరీకి గురవుతున్న బాలకార్మికులను గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. బాల కార్మికుల్లో 11 మంది బాలికలు, 88 బాలురు ఉన్నారని తెలిపారు. చిన్నారులను పనిలో పెట్టుకుని వెట్టిచాకిరీ చేయిస్తున్న 61మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. చిన్నారులను ఎవరైనా పనిలో పెట్టుకుంటే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

జనరంజక బడ్జెట్



కేంద్ర బడ్జెట్ జనరంజకంగా ఉంది. పేద, మధ్యతరగతి వర్గాలకు ఊరట కలిగేలా ఆదాయ పన్ను పరిమితిని రూ.12లక్షలకు పెంచడం హర్షణీయం. గిగ్‌వర్కర్లు, పట్టణపేదలు, మహిళాసంఘాల సభ్యులకు ప్రోత్సాహకం కలిగించేలా బడ్జెట్‌లో నిర్ణయాలు ఉన్నాయి. దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించేలా దుస్తులపై సుంకం తగ్గించారు. దీంతో దేశీయ తయారీ దుస్తుల ధరలు తగ్గుతాయి. స్టార్టరప్స్‌కు ప్రోత్సాహకాలను ప్రకటించడం హర్షణీయం. మొత్తంగా బడ్జెట్ ఆశాజనకంగా ఉంది.

● డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు.

తెలంగాణకు మొండిచేయి



బడ్జెట్‌లో కేంద్రం తెలంగాణకు మొండిచేయి చూపింది. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్రమంత్రులున్నా ఒక్క పథకమూ తేలేకపోయారు. ఏ ఒక్క వర్గానికీ న్యాయం జరగలేదు. రైతులను నట్టేట ముంచేలా కేంద్రం కేటాయింపులు ఉండడం బాధాకరం. ఉమ్మడి జిల్లాకు సంబంధించి రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారుల కనీస ప్రస్తావన బడ్జెట్‌లో లేకపోవడం బాధాకరం. నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ప్రస్తావన కూడా లేకపోవడం శోచనీయం.

● కె. శంకర్‌నాయక్, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు.

రైతులపై చిన్నచూపు



కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి ఆశించిన కేటాయింపులు లేవు. పీఎం కిసాన్ యోజన పరిధి పెంచలేదు. సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు లేకపోవడం బాధాకరం. బ్యాంకుల నుంచి రుణాల పెంపు విషయాన్ని కేంద్రం పట్టించుకోలేదు. మొత్తంగా వ్యవసాయరంగానికి ఈ బడ్జెట్ ద్వారా ఎలాంటి ప్రోత్సాహకాలు లభించలేదు. బడ్జెట్ సవరణల్లోనైనా రైతులకు ఉపయుక్తమయ్యేలా చూస్తారని ఆశిస్తున్నాం.

● కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, టీడీపీ నల్లగొండ పార్లమెంట్ కన్వీనర్.

తెలంగాణకు ప్రాధాన్యమేదీ?



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై పూర్తి వివక్ష కనబరిచారు. ఏపీకిచ్చిన ప్రాధాన్యం తెలంగాణకు ఇవ్వలేదు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయినప్పుడు చేసుకున్న ఒప్పందాలకు అనుగుణంగా కూడా కేంద్రం తెలంగాణకు న్యాయం చేయకపోవడం బాధాకరం. ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం కావడంతో ఆ రాష్ట్రానికి చెందిన ప్రాజెక్టులకు కేంద్రం పెద్ద మొత్తంలో నిధులిచ్చింది. తెలంగాణలో ప్రతిపక్షం అధికారంలో ఉండడం వల్లే నిధుల కేటాయింపుల్లో వివక్ష చూపినట్టు తెలుస్తోంది. రాష్ట్రం ఇచ్చిన ప్రతిపాదనలకు కేటాయింపులే లేవు.

● బండా నరేందర్‌రెడ్డి, నల్లగొండ జడ్పీ మాజీ చైర్మన్.

బడ్జెట్ అంకెల గారడీ



బడ్జెట్ అంకెల గారడీలా ఉంది. బడ్జెట్‌లో రైతాంగానికి ఎలాంటి భరోసా ఇవ్వలేదు. వ్యవసాయ రంగానికి నిధులు పెంచలేదు. పంటలకు మద్దతు ధర ఊసే లేదు. వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వలేదు. ఢిల్లీలో కొన్ని రోజులుగా రైతులు, రైతు నాయకులు నిరాహార దీక్ష చేస్తున్నా రైతు వ్యతిరేక విధానాల పట్ల కేంద్రం తన వైఖరిని స్పష్టం చేయలేదు. రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇవ్వలేదు.

● మల్లు నాగార్జునరెడ్డి, సీపీఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శి.

చేనేతపై చిన్నచూపు



బడ్జెట్‌లో చేనేతకు రూ.200 కోట్లు మాత్రమే కేటాయించి చిన్న చూపు చూశారు. బడ్జెట్‌లో చేనేతకు ప్రత్యేకంగా రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి. ఇల్లు లేని చేనేత కార్మికులకు వర్క్‌షెడ్ కమ్ హౌస్ నిర్మించి ఇవ్వాలి. పది శాతం ఉన్న మాల్ సబ్సిడీని 25 శాతానికి పెంచాలి. చేనేతపై జీఎస్టీ ఎత్తివేయాలి.

● పాశికంటి లక్ష్మీనర్సయ్య, చేనేత కార్మిక సంఘం నాయకుడు, మోత్కూరు

నేడు పెద్దగట్టు లింగమంతుల స్వామి దిష్టిపూజ

● ఏర్పాట్లు పూర్తి చేసిన భక్తులు

● కేసారంలో దేవరపెట్టెకు స్వాగతం పలికిన భక్తులు





సూర్యాపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అతిపెద్ద జాతరల్లో ఒకటైన సూర్యాపేట జిల్లాకేంద్ర సమీపంలోని లింగమంతుల జాతర(పెద్దగట్టు)లో మొదటి ఘట్టం జరుగనుంది. ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహించే జాతర రాష్ట్రంలోనే సమ్మక్క, సారమ్మల తర్వాత జరిగే అతి పెద్దజాతర. ఆనవాయితీగా జాతర ప్రారంభానికి 15రోజుల ముందు వచ్చే ఆదివారం అర్ధరాత్రి 12గంటలకు చేపట్టే దిష్టిపూజ కార్యక్రమాన్ని నేటి అర్ధరాత్రి చేపట్టనున్నారు. ఈ దిష్టిపూజ కార్యక్రమానికి పెద్దఎత్తున యాదవ భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది.

కేసారం గ్రామానికి సౌడమ్మపెట్టె

పెద్దగట్టు జాతరలో భాగంగా ఈ నెల 2 అర్ధరాత్రి చేపట్టే దిష్టిపూజకు ముందు మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం చీకటాయపాలెం గ్రామం నుంచి అందనం సౌడమ్మ దేవరపెట్టెను సూర్యాపేట మండలం కేసారం గ్రామస్థులు భజనలతో కేసారం గ్రామానికి శనివారం రాత్రి తీసుకొచ్చారు. మెంతబోయిన కుటుంబాలకు చెందిన యాదవులు స్వామిని స్మరిస్తూ సౌడమ్మ దేవరపెట్టెను బేరీలు, గజ్జెల డప్పులతో ఊరేగింపుగా గ్రామంలో ఉంచారు. నేటి అర్ధరాత్రి మెంతబోయిన కుటుంబాలకు చెందిన యాదవులు దేవరపెట్టెను బేరీలు, గజ్జెల డప్పులతో ఊరేగింపుగా దురాజ్‌పల్లి గుట్టపైకి తీసుకొచ్చి మొక్కులు చెల్లిస్తారు. గుట్టపై చేస్తున్న లింగమంతుల స్వామి, సౌడమ్మ, యలమంచమ్మ దేవతలకు భక్తిశ్రద్ధలతో బోనాలను నైవేద్యంగా సమర్పిస్తారు. యాదవ పూజారులు గర్భగుడి ముందు చంద్రపట్నం ముగ్గులతో పటం వేసి బైకాన్‌లు, యాదవ పూజారులు లింగమంతుల స్వామి కథలు చెబుతారు. ఆదివారం అర్ధరాత్రి తల్లి పిల్ల గొర్రెలను లింగమంతుల స్వామికి బలి ఇచ్చి యాదవులు ఓ లింగా ఓ లింగా నామస్మరణంతో గుట్ట చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ బలి చల్లుతారు. దీంతో కార్యక్రమం పూర్తవుతుంది.

భక్తులకు కోసం తాత్కాలిక ఏర్పాట్లు

నేడు జరిగే పెద్దగట్టు దిష్టిపూజ కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సూర్యాపేట మునిసిపాలిటీతో పాటు వివిధశాఖల ఆధ్వర్యంలో తాత్కాలికంగా ఏర్పా ట్లుచేస్తున్నారు.మౌలిక సౌకర్యాలతో పాటు పారిశుధ్యాన్ని మెరుగుపరిచారు. పలుశాఖల అధికారులు దిష్టిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నిత్యం పనులను పర్యవేక్షిస్తున్నారు.

నూతనకల్‌లో దేవరపెట్టెకు స్వాగతం

దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరకు దిష్టిపూజకు తొర్రూర్ మండలం చీకటాయపాలెం నుంచి దురాజ్‌పల్లికి తరలిస్తున్న దేవరపెట్టెకు నూతనకల్‌లో యాదవులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో దరిపెల్లి వీరన్న, పసుల అశోక్‌యాదవ్, వేల్పుల రఘు, కొర్వి గంగయ్య, మున్న అశోక్, మణి, గణేష్, మల్లయ్య పాల్గొన్నారు.

జాతరకు రూ.5 కోట్లు విడుదల

పెద్దగట్టు జాతరకు రాష్ట్ర ప్రభుత్వం మునుపెన్నడూ లేనివిధంగా రూ.5 కోట్లు శనివారం విడుదల చేసింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి విన్నపం మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జాతర అభివృద్ధి పనులకు, జాతర నిర్వహణ, ఇతర మార్గదర్శకాల మేరకు నిధులు వాడుకోవాలని సూచించారు.

నల్లగొండలో నగరోత్సవం

● చెర్వుగట్టు జాతరలో నేడు మొదటి ఘట్టం ● 5న తెల్లవారు జామున కళ్యాణం



నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం నల్లగొండలో నిర్వహించే నగరోత్సవంతో ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. ఈ నెల 4న పాంచాహ్నిక దీక్షతో చెర్వుగట్టు ఆలయంలో ఉత్సవ పూజా కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. 5న (బుధవారం) తెల్లవారుజామున కల్యాణం, 7న (శుక్రవారం) తెల్లవారుజామున అగ్నిగుండాలు, 8న (శనివారం) తెల్లవారుజామున అశ్వవాహన సేవ, అదేరోజు రాత్రి ఏకాంత సేవలు, మహాపూర్ణాహుతి, 9న (ఆదివారం) గ్రామోత్సవం చెర్వుగట్టు, ఎల్లారెడ్డిగూడెం గ్రామాల్లో గజవాహన సేవతో ఉత్సవాలు ముగుస్తాయి. అల్లవరపు సుబ్రహ్మణ్యదీక్షితావధాని పర్యవేక్షణలో నీలకంఠ శివాచార్య, దేవస్థాన ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరస్వామి అర్చక పర్యవేక్షణలో ఉత్సవ విశేష పూజాధికాలను నిర్వహించనున్నారు. కాగా ఉత్సవాల్లో స్వామివారి కల్యాణోత్సవం, అగ్నిగుండాలకు భక్తులు పోటెత్తనున్నారు. అగ్నిగుండాల రోజున శివసత్తులు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు.

చెర్వుగట్టులో పట్టు వస్త్రాలు సమర్పించేదెవరు!

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉపాధ్యాయ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు పట్టువస్త్రాలు సమర్పించే విషయంలో జిల్లా అధికార యంత్రాంగం సందిగ్ధంలో పడింది. ఈ నెల 2 నుంచి 9వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 5వ తేదీ తెల్లవారుజామున పార్వతీ జడలరామలింగేశ్వరుల కల్యాణం జరగనుంది. అయితే ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను జిల్లాకు చెందిన మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు ప్రభుత్వ ప్రతినిధులుగా హాజరై సమర్పించడం ఆనవాయితీ. కానీ ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించే విషయంలో సందిగ్ధత నెలకొంది. అయితే కోడ్ అమలుకు ముందే ఉత్సవ ప్రక్రియ ప్రారంభమైనందున ఆనవాయితీని గౌరవిస్తూ ప్రభుత్వ పెద్దల చేత పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించేందుకు అనుమతి కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రాతపూర్వకంగా కోరనున్నట్లు సమాచారం. ఈసీ అనుమతిస్తే ఆనవాయితీ కొనసాగనుంది. లేకుంటే నల్లగొండ జిల్లా కలెక్టర్ త్రిపాఠి దంపతులు పట్టువస్త్రాలు సమర్పిస్తారని అధికారులు చెబుతున్నారు. అయితే స్వామివారికి ఎమ్మెల్యే ఇతర ప్రజాప్రతినిధులు పట్టువస్త్రాలు సమర్పించాలనుకుంటే స్వయంగా వస్త్రాలను తీసుకువచ్చి ప్రొటోకాల్‌తో నిమిత్తం లేకుండా సమర్పించాల్సి ఉంటుంది.

వాహనం ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి

కట్టంగూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలో శనివారం జరిగింది. ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయస్సు గల మహిళా నకిరేకల్ వైపు జాతీయ రహదారిపై అయిటిపాముల నుంచి నకిరేకల్ వైపు వెళ్తుంది. చెర్వుఅన్నారం క్రాస్‌రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఇతరవాహనాలు మృతురాలిపై నుంచి పోవడంతో శరీరంనుజ్జయ్యింది. మహిళా ఎరుపురంగు చీర, బ్లూకలర్ జాకెట్ ధరించినట్లు ఎస్‌ఐ తెలిపారు. అయిటిపాముల గ్రామకార్యదర్శి అనిల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి ...

పెద్దవూర, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి):చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు.నల్లగొండ జిల్లా పెద్దవూర ఎస్‌ఐ వీరబాబు తెలిపినవివరాల ప్రకారం 58ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి 29న పెద్దవూర వైజంక్షన్ వద్ద అపస్మారకస్థితిలో ఉన్నాడు. స్థానికులు గుర్తించి 108 వాహనంలో సాగర్‌లోని కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ జనవరి 30న మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామని, ఇతర వివరాలకు పోలీసులను సంప్రదించాలన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు

చౌటుప్పల్ రూరల్ ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో ఆర్థికఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఎస్.లింగోటం గ్రామానికి చెందిన కూలీ పల్సం గణేష్(37) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 30న ఇంట్లో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులతో తన భర్త ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య విజయ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. కాగా మృతుడిపై పలు పోలీసుస్టేషన్లలో దొంగతనాల కేసులు ఉన్నాయి. ఈ క్రమంలో మందోళ్ల గూడెంలో బైక్ చోరీకి గురైంది. గణేష్‌పై అనుమానంతో ఈ నెల 30న పోలీసులు ఇంటికివచ్చారు. అవమానంగా భావించి గణేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

క్యాన్సర్‌తో ఆరేళ్ల బాలుడి మృతి



సాయిరామ్

తిప్పర్తి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో క్యాన్సర్‌తో ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన పోలెబోయిన లింగస్వామి, కల్యాణి దంపతులకు కుమార్తె, కుమారుడు సాయిరామ్(6) ఉన్నారు. గతేడాది కిందట సాయిరామ్ బోన్ క్యాన్సర్ బారిన పడినట్లు వైద్యులు గుర్తించారు. తల్లిదండ్రులు కుమారుడి కోసం సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు చేసినా, ఫలితం లేకపోయింది. రెండు రోజుల కిందట వరకు సరదాగా ఆడుకున్న బాలుడు పూర్తిగా నీరసించి శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. బాలుడి జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకొని తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

ఎంజీయూలో పలు విభాగాలకు నియామకాలు

నల్లగొండ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్‌గా అల్వాల రవిని నియమించారు. ఆ పదవిలో ఆయన రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. అదేవిధంగా ఇంజనీరింగ్ విభాగం డీన్‌గా రేఖను, కంప్యూటర్ సైన్స్ విభాగం డీఎస్‌ను డీన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విధులకు నై, క్రికెట్ పోటీలకు సై

● డ్యూటీకి డుమ్మా కొట్టి బ్యాట్, బాల్ పట్టిన 64మంది కార్యదర్శులు

● సాగర్ నియోజకవర్గంలో వెలుగులోకి ● పలువురికి షోకాజ్‌లు



కార్యదర్శులకు ఇచ్చిన షోకాజ్ నోటీస్

నల్లగొండ/ నల్లగొండటౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో 64 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసుల విషయం చర్చనీయాంశంగా మారింది. గత కొద్దిరోజుల కిందటే 99మంది కార్యదర్శులు గ్రూప్ పరీక్షలకు సిద్ధమయ్యే పేరిట విధులకు ఎగనామం పెట్టి సొంత పనులు చేసుకుంటుండటంతో నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వారి సర్వీస్ బ్రేక్ చేసి ఆ తరువాత మానవతా దృక్పథంతో పోస్టింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇది జరిగి కొద్దిరోజులు కాకముందే కార్యదర్శుల్లో ఎలాంటి మార్పు రాకపోగా మరింత ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరు ఈ సంఘటన అద్దంపడుతోంది. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో గత నెలలో 29, 30, 31 తేదీల్లో ఎలాంటి సెలవులు లేకున్నా ఉన్నతాధికారులకు సమాచారంలేకుండా విధులకు గైర్హాజరయ్యారు. ఏకంగా ప్రీమియంలీగ్ క్రికెట్ పేరిట విధులకు డుమ్మా కొట్టిన కార్యదర్శులు హాలియాలోని ఓ కళాశాలలో క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వస్తున్నారంటూ ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు బాధ్యత వహించి మొత్తం 64 మందితో టీమ్‌లు ఏర్పాటు చేసి ఆడించారు. కనీసం ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోవడం, సెలవులు పెట్టలేదు. ఓ వైపు ప్రతిష్టాత్మకంగా అనేక సంక్షేమపథకాల కోసం సర్వేలు, గ్రామసభలు నిర్వహిస్తుంటే కార్యదర్శులు మాత్రం అవేమీ పట్టనట్లు క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇప్పటికే పలువురికి నోటీసులు ఇచ్చిన ప్రభుత్వాధికారులు వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. అదేవిధంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజే ప్రజాప్రతినిధుల ఫొటోలు పెట్టడమే కాకుండా సెలవులు పెట్టకుండా క్రికెట్ ఆడటంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

ఎంపీడీవోల నుంచి నివేదిక తెప్పించుకుంటున్నాం

జనవరి చివరల్లో నాగార్జునసాగర్ ప్రీమియర్ లీగ్ పేరుతో హాలియాలో గ్రామకార్యదర్శులు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించినట్లు తమ దృష్టికి వచ్చింది. దీనిపై ఎంపీడీవోల ద్వారా రిపోర్టు తెప్పించుకుంటున్నాం. ఇప్పటికే కొందరికి షోకాజ్ నోటీసులు జారీచేశాం. ఎంపీడీవోల రిపోర్టు అనంతరం ఎంతమంది పాల్గొన్నారు అనే విషయం స్పష్టమవుతోంది. అనంతరం వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం.

వెంకయ్య, జిల్లా పంచాయతీ అధికారి, నల్లగొండ

కారులో జీవాలను దొంగిలిస్తున్న ముఠా అరెస్టు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జీవాలను చోరీ చేస్తున్న ముఠాను యాదాద్రిభువనగిరిజిల్లా ఆత్మకూరు(ఎం) పోలీసులు పట్టుకొని అరెస్టు చేసినట్లు చౌటుప్పల్ ఏసీపీ పీ మధుసూదన్ రెడ్డి తెలిపారు. శనివారం ఆత్మకూరు(ఎం) పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 22న మండలంలో కూరెళ్ల గ్రామంలో మేకల దొంగతనం జరిగింది. జనవరి 31న ఆత్మకూరు(ఎం) మండలం కప్రాయిపెల్లి వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఓ కార్లలో నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కన్పించారని తెలిపారు. కారును తనిఖీ చేయగా కారు వెనుకభాగంలో సీట్లు తొలగించి ఉన్నాయని, కారులో మేకల పేడ కన్పించడంతో అనుమానంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా పలు విషయాలు బయటకు వచ్చాయని ఏసీపీ తెలిపారు. మేకలు, గొర్రెలను ఎత్తుకెళ్ళడానికి తెలివిగా దొంగలు కార్లను వినియోగిస్తున్నారని తెలిపారు. కారులోని నలుగురిని విచారించగా ఏడుగురు ముఠాగా ఏర్పడి ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు సైబరాబాద్ ప్రాంతాల్లో మేకలు, గొర్రెలు, పశువులను చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని వివరించారు. నల్లగొండ జిల్లా హాలియా మండలానికి చెందిన సంపంగి వెంకటేష్, సంపంగి వెంకన్న, వెంకన్న భార్య సంపంగి శారద, సోదరి కునుకుల నందిని ,మునుగోడు మండలానికి చెందిన వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన రావుల శివ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా గురుజాలకు చెందిన అమ్ములూరి విజయ్ ప్రసాద్ ముఠాగా ఏర్పడి దొంగిలిస్తున్నట్లు తెలిపారని ఏసీపీ వివరించారు. ముఠా దొంగలు ఏడుగురిని స్థానిక పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. దొంగలు వాడిన రెండు కార్లు, బైక్‌ను సీజ్ చేసి, రూ.46 వేల నగదుతో పాటు చిన్న గొర్రెపిల్లను రికవరీ చేశామన్నారు. ముఠాను పట్టుకోవడానికి చాకచక్యంగా వ్యవహరించిన ముగ్గురు కానిస్టేబుళ్లు, డ్రైవర్‌ను ఏసీపీ అభినందించి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఎస్‌ఐ కృష్ణయ్య కృషిని ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం బోల్తా.. రాకపోకలకు అంతరాయం





వాహనం బోల్తాతో ఒలికిపోయిన రంగులు, నిలిచిన వాహనాలు

బీబీనగర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-వరంగల్ 163వ జాతీయ రహదారిపై వాహనం బోల్తా పడి కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచింది. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలో ఈ సంఘటన జరిగింది. హైదరాబాద్ నుంచి రంగు డబ్బాల లోడ్‌తో భువనగిరి వైపు వెళ్తున్న మినీ డీసీఎం వాహనం ఎఫ్‌సీఐ పూసల గోదాం సమీపంలో శనివారం ఉయదం 8 గంటల సమయంలో అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. దీంతో వాహనంలో ఉన్న రంగు డబ్బాలన్నీ రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న రోడ్డు మార్గంలో భారీగా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సుమారు 40 నిమిషాల పాటు వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. ఈ సంఘటనతో జిల్లాలోని పలు మండలాల్లో పని చేస్తున్న ఉద్యోగులు సకాలంలో విధులకు వెళతామో లేదోనని ఆందోళన చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు, టోల్‌ప్లాజా, ఎన్‌హెచ్‌ఏఐ పెట్రోలింగ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బీబీనగర్ మండలకేంద్రంలోని బైపాస్ రోడ్డులో బ్యాంకు సర్కిల్ వద్ద హైదరాబాద్ వైపు వస్తున్న వాహనాలను సర్వీస్ రోడ్డువైపు దారి మళ్లించి రోడ్డుపై బోల్తాపడిన వాహనాన్ని రంగు డబ్బాలను పక్కకు తొలగించారు. అనంతరం వాహనాలను పునరుద్ధరించారు. ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు తప్పిన బహిష్కరణ ముప్పు

(7వ పేజీ తరువాయి)

కెమిస్ట్రీ, బయాలజీ, ఒకేషనల్ కోర్సుల ల్యాబ్‌లు నిర్దేశిత ప్రమాణాలతో ఉండాల్సిందే. విద్యార్థులతో తప్పకుండా ప్రాక్టికల్స్ చేయించాలి. కానీ ప్రభుత్వ, కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో మాత్రమే ల్యాబ్‌లు సక్రమంగా ఉండగా, మెజార్టీ ప్రైవేట్ కళాశాలల్లో నామమాత్రమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రాక్టికల్స్ పరీక్షా కేంద్రాలన్నింటిలో సీసీ కెమెరాల బిగింపును ఇంటర్మీడియట్ బోర్డు తప్పనిసరి చేసింది. బోర్డు హడావుడిగా తీసుకున్న ఈ నిర్ణయంతో ఆర్థిక భారం పడుతుందని ప్రైవేట్ యాజమాన్యాలు పరీక్షల బహిష్కరణకు సిద్ధమయ్యాయి. అంతేగాక పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌ను ముందు పెట్టాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కూడా జరగనుండటంతో ప్రభుత్వ జోక్యంతో సీసీ కెమెరాల బిగింపు నిర్ణయాన్ని ఇంటర్‌బోర్డు ఏడాదిపాటు వాయిదా వేసినట్టు ప్రచారం అవుతోంది. కనీసం వచ్చే పరీక్షలనైనా సీసీ కెమెరాల నిఘాలో నిర్వహిస్తే విద్యార్థులకు సబ్జెక్ట్‌పరంగా న్యాయం జరుగుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

కనికరించని నిర్మలమ్మ

(7వ పేజీ తరువాయి)

దుస్తుల ధరలు తగ్గనున్నాయి.అదేవిధంగా సిగరెట్లపై పన్నుపెంచడం ద్వారా వాటి ధరలు పెరగనున్నాయి.

గిగ్‌వర్కర్లకు కార్మికభద్రత

గిగ్‌వర్కర్లకు శ్రమ్‌పోర్టల్ ద్వారా కార్డులు పంపిణీ చేస్తామని కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించారు. వారిని ప్రధానమంత్రి ఉచిత బీమాపథకం పరిధిలోకి తీసుకొచ్చి భద్రత కల్పించనున్నట్లు తెలిపారు.

పట్టణ పేదలకు, స్వయం సహాయక సంఘాలకు క్రెడిట్‌కార్డులు

పట్టణపేదలకు రూ.30వేల పరిమితితో యూపీఐ లింక్డ్ క్రెడిట్ కార్డులు అందించేందుకు నిర్ణయించామని కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ప్రకటించారు. అదేవిధంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సైతం గ్రామీణ్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేయనున్నారు. వ్యవసాయరంగంలో కిసాన్ క్రెడిట్‌కార్డుల పరిమితిని రూ.5లక్షలకు పెంచారు.

సీపీఎస్‌కు కలగని మోక్షం

2004 సంవత్సరం తరువాత నియామకమైన ఉద్యోగులను ఇబ్బందిపెట్టేలా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ సిస్టం (సీపీఎస్) విధానం రద్దుకు కేంద్రం ఆమోదం తెలపకపోవడంపై ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల వేతనం నుంచి కోత విధించే విధంగా వేతనంలో కొంత శాతాన్ని షేర్ మార్కెట్‌లో ఉంచడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీఎఫ్ ఆర్‌డీఏ చట్టాన్ని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. సీపీఎస్ అమలులోకి రావడంతో తక్కువ సర్వీస్‌తో మృతిచెందిన ఉద్యోగులకు పెన్షన్ అతి తక్కువగా వస్తోంది. దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పెద్దఎత్తున డిమాండ్ చేస్తున్నారు.

పలు రాష్ట్రాల్లో ఇప్పటికే సీపీఎస్‌ను ఆయా ప్రభుత్వాలు రద్దు చేశాయి. కేంద్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని తీసుకరావడంతో ఉద్యోగుల్లో వ్యతిరేక భావం ఏర్పడింది. సీపీఎస్‌ను రద్దు చేస్తామని పలు పార్టీలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినా ఆచరణలో మాత్రం ముందుపడలేదు. బడ్జెట్ సమయంలోనైనా సీపీఎస్ ఉద్యోగులకు ఊరట కలుగుతుందని ఆశించినా వారికి నిరాశే మిగిలింది.

పీఎం ఆవాస్ యోజనతో మేలు

కేంద్ర ప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన కింద గృహ నిర్మాణదారుడికి, కొనుగోలుదారుడికి రూ.2.65లక్షలు వారి ఖాతాల్లో జమ చేస్తుంది. అయితే బ్యాంకుల్లో రుణం పొంది ఇంటి నిర్మాణం చేసుకున్న వారికి మాత్రమే ఈ సదుపాయం వర్తిస్తుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బ్యాంకుల్లో రుణాలు పొందుతున్న వారికి ఈ ప్రయోజనం దక్కనుంది. అన్ని ప్రైవేట్, వాణిజ్య బ్యాంకులు ద్వారా రుణాలు పొందిన వారికి పీఎం ఆవాస్ యోజన వర్తించనుంది. ఈ బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా 2కోట్ల ఇళ్ల నిర్మాణానికి పీఎం ఆవాస్ యోజన్‌ను వర్తింపజేయనున్నట్టు ప్రకటించారు. ఈ నిర్ణయంతో పేద, మధ్యతరగతి వర్గాలకు ఊరట కలగనుంది.

55.85% బీసీలు!

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన వివరాలతో నివేదికను రూపొందించారు. సమగ్ర కుల సర్వే వివరాల నివేదికను ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రివర్గ ఉపసంఘానికి అధికారులు అందజేయనున్నారు. ఆ నివేదికపై ఉపసంఘం అధ్యయనం చేయనుంది. 5న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఆ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. అదే రోజు మధ్యాహ్నం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి, బీసీల రిజర్వేషన్లపై ఒక తీర్మానం చేసి.. దాన్ని కేంద్రానికి పంపనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ మేరకు బీసీల రిజర్వేషన్లను పెంచేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ మేరకు రాష్ట్రంలో 50 శాతం రిజర్వేషన్లు మించకుండా, న్యాయపరమైన సమస్యలు లేకుండా ఉండేలా ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. కాగా, మార్చి 20 నాటికి రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను పూర్తిచేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆ దిశగా పంచాయతీరాజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపడుతున్నారు. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల నిర్వహణకు అవసరమైన కార్యాచరణ చేపడుతోంది. కుల సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరనుండడంతో ఎన్నికల అంశం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

బీసీ కమిషన్.. కుల సర్వే ఆధారంగా రిజర్వేషన్..



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, సీతక్క, రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం, సురేఖ, ఉత్తమ్, జూపల్లి, కోమటిరెడ్డి, ఎంపీ బలరామ్

తెలంగాణ ఏర్పాటైన తర్వాత అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో సర్వే చేపట్టింది. దాని ప్రకారం 2014లో బీసీలు 51శాతం, ఓసీలు 21, ఎస్సీలు 18, ఎస్టీలు 10 శాతం ఉన్నట్టు తేలింది. కానీ, ఈ సర్వేను అధికారికంగా విడుదల చేయలేదు. మళ్లీ 10 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇటీవల సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో కులం, మతం సహా అన్ని వివరాలను సేకరించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో ఎంతమేర రిజర్వేషన్లను కల్పించాలనే అంశంపై ప్రభుత్వం ఈ సర్వేను వినియోగించుకోనుంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో బీసీల రిజర్వేషన్ల ఖరారు కోసం సర్కారు బీసీ కమిషన్‌తో పాటు, ప్రత్యేక కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. ప్రత్యేక కమిషన్ కూడా బీసీల రిజర్వేషన్లపై లోతుగా అధ్యయనం చేసింది. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిసింది. సర్వే వివరాలు, ప్రత్యేక కమిషన్ సూచనలను పరిగణనలోకి తీసుకొని.. స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లపై సర్కారు నిర్ణయం తీసుకోనుంది.

మంత్రులతో సీఎం భేటీ..


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్లో భేటీ అయ్యారు. బీసీలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై చర్చించారు. సమావేశం అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ మీడియాతో మాట్లాడారు. పొన్నం మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వే, బీసీ కులగణనపై శాసనసభలో తీర్మానం చేసి, ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు. కులగణన కార్యరూపం దాల్చే అంశంపై సీఎం చర్చించారని తెలిపారు. దీంతోపాటు ఎస్సీ వర్గీకరణపై సబ్‌కమిటీ తీసుకున్న నిర్ణయాలపైనా చర్చించామన్నారు. ఈ నెల 5న సబ్ కమిటీ ఇచ్చిన నివేదికను క్యాబినెట్ ముందు పెడుతున్నారని, అదే రోజు శాసనసభలో చర్చించి ప్రజాస్వామ్య యుతంగా ముందుకు తీసుకెళతామని చెప్పారు.

వర్గీకరణపై త్వరలో నివేదిక: రాజనర్సింహ

సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన రెండు గంటల్లోనే ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ప్రకటన చేశామని, వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. దీనిపై ఇప్పటికే సానుకూలంగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉపసంఘం వేశారన్నారు. ఉపసంఘం సూచన మేరకు ఏకసభ్య కమిషన్‌ను నియమించామని.. ఈ కమిషన్ త్వరలో నివేదిక ఇవ్వబోతోందని తెలిపారు. దానిపై మంత్రివర్గంలో చర్చించి, అసెంబ్లీలో ప్రవేశపెడతామని చెప్పారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

» లీకేజీలను అరికట్టేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు
» సరఫరాకు అంతరాయం కలుగకుండా జనరేటర్ కొనుగోలు



రామగిరి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజలకు మంచినీటి సమస్య రాకుండా మునిసిపల్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. నల్లగొండ పట్టణంలో 48 వార్డుల్లో సుమారు 40 వేల గృహాలకు గాను ప్రస్తుతం రోజు విడిచి రోజు 30 ఎంఎల్‌డీ నీరు సరఫరా అవుతుంది.దీంతో పాటు శివారు ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. అయితే రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా లీకేజీలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా అదనంగా మరో మోటార్‌ను అందుబాటులో తీసుకొచ్చారు. దీంతోపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిన సమయంలో మంచినీటి సరఫరాకు ఎలాంటి సమస్య ఎదురుకాకుండా ఉండాలని సుమారు రూ.30 లక్షలు విలువైన జనరేటర్‌ను కొనుగోలు చేసేందుకు అధికారులు తగు ప్రణాళికలు రూపొందించారు. అవసరమైతే అద్దె ట్యాంకర్లను కూడా తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా 2.0 టీఎంసీ సామర్థ్యం కలిగిన పానగల్ ఉదయం సముద్రం ప్రస్తుతం 1.5 టీఎంసీ మంచినీరు ఉన్నందున జూన్ వరకు నీటి సమస్య ఉండదని అధికారులు లెక్కలు వేసుకుంటున్నారు.

జూన్ వరకు ఎలాంటి సమస్య ఉండదు



ఉదయసముద్రంలో ప్రస్తుతం 1.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రతీరోజు 30 ఎంఎల్‌డీ చొప్పున సరఫరా చేస్తునాం. ఈ లెక్కప్రకరం జూన్ నెల వరకు నీటి కొరత ఉండదు. దీంతో పాటు సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండడానికి జనరేటర్, కొత్త మోటార్లు ఏర్పాటు చేస్తున్నాం. మంచినీటి సమస్యపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నెంబర్ కూడా ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం.

- సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్, నల్లగొండ

బీజేపీ జిల్లా అధ్యక్ష పదవి కోసం నామినేషన్లు

రామగిరి, ఫిబ్రవరి 1: బీజేపీ జిల్లా అధ్యక్ష పదవి కోసం శనివారం నామినేషన్ల దరఖాస్తులను జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి కట్ట సుధాకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి చెన్నమోని రాములు స్వీకరించారు. జిల్లా అధ్యక్ష పదవి కోసం నాగం వర్షిత్‌రెడ్డి, బండారు ప్రసాద్, కన్మంత రెడ్డి శ్రీదేవిరెడ్డి, దోనూరు వీరారెడ్డి నామినేషన్లు వేశారు. ఈ నామినేషన్ దరఖాస్తులను రాష్ట్ర కమిటీ పరిశీలించి ఆదివారం సాయంత్రంలోగా ప్రకటించే అవకాశం ఉంది.

కబడ్డీ పోటీలు

నాంపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మిషన్ పరివర్తన్ యువతేజం కార్యక్రమంలో భాగంగా నాంపల్లి మండలంలో కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి గ్రామం ఆసక్తి ఉన్న ప్రతి క్రీడాకారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతిభ కనబరిచిన జట్లకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

చిట్యాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించడం వల్ల మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో సైదానాయక్, నార్కట్‌పల్లి సీఐ నాగరాజు అన్నారు. త్రోబాల్ సబ్‌జూనియర్ విభాగంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి రాష్ట్రస్థాయి క్రీడాకారుల ఎంపిక కోసం శనివారం చిట్యాల గ్రీన్‌గ్రోవ్ పాఠశాలలో నిర్వహించిన పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. అంతేకాక విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. పోటీల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో త్రోబాల్ స్టేట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, కోశాధికారి, జిల్లా అధ్యక్షుడు పూర్ణచందర్‌రాజు, ప్రధానకార్యదర్శి మోత్కూరు యాదయ్య, గంగాపురం రాము, బండి వీణఅనిల్‌కుమార్‌రెడ్డి, జూలకంటి వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి



సమావేశంలో బీఆర్‌ఎస్వీ నాయకులు శ్రీను, నాగార్జున

నల్లగొండ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు కట్ట శ్రీను, బొమ్మరబోయిన నాగార్జున అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకొని వెంటనే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే రోజుల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని వారు హెచ్చరించారు. నల్లగొండ పట్టణాన్ని బీఆర్‌ఎస్ పాలనలో రూ.1350 కోట్లతో అభివృద్ధి చేశారని, ఆ విషయం ప్రజలకు తెలుసు నని పేర్కొన్నారు. నల్లగొండ పట్టణంలో పనులు నాణ్యత లేకుండా చేస్తున్నారని వారు ఆరోపించారు. సమావేశంలో నాయకులు అంబటి ప్రణీత్, కందుల సంపత్‌కుమార్, జాన్ ప్రేమ్, అనిల్, పురుషోత్తం, జయచందన్, ఉబేద్, రాజన్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీడీపీవో సక్కుబాయి

మర్రిగూడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సీడీపీవో సక్కుబాయి పరిశీలించారు. శనివారం పరిశీలించారు. 'మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాలు' అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతి ఎడిషన్‌లో ప్రచురితమైన వార్తకు ఐసీడీఎస్ సీడీపీవో సక్కుబాయి స్ప దించారు. ఈ మేరకు శనివా రం మండలంలోని యరగండ్లపల్లి, పడమటితండ, కమ్మగూడెం గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో గర్భిణులు, చిన్నారుల తల్లులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ మె మాట్లాడుతూ ఈ మూడు కేంద్రాల్లో టీచర్లు పదవి విరమణ పొందినందున చిన్నారులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. నేటి నుంచి ఇన్‌చార్జిలను నియమించినట్లు పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ పోస్టులను భర్తీ చేసేందుకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద, టీచర్ మమత ఉన్నారు.

కులవృత్తులను కాపాడుకోవాలి

చిట్యాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కులవృత్తిదారులు తమ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉండాలని చిట్యాల కులవృత్తిదారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగిళ్ల లక్ష్మణ్‌రావు అన్నారు. చిట్యాలలో శనివారం నిర్వహించిన వివిధ కులవృత్తిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులవృత్తిదారుల హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దౌలతాబాద్ వాసుదేవశర్మ, అధ్యక్షుడు పోకల రమేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సిలివేరు శేఖర్, ప్రధాన కార్యదర్శి సిలివేరు యాదగిరి, ఉపాధ్యక్షుడు సిలివేరు అంజయ్య, సలహాదారులుగా అమరోజు వెంకటేశం, ఎద్దులపురి కృష్ణ, కోశాధికారి రాజయ్య, కార్యదర్శులుగా స్వామి, నాగరాజు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

ఆమోదయోగ్యంగా మాస్టర్ ప్లాన్



మాట్లాడుతున్న మునిసిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గుమ్ముల మోహన్‌రెడ్డి

రామగిరి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణ ప్రజలందరికీ ఆమోదకరంగా ఉండేలా తయారైన మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వం జీవోను విడుదల చేసిందని మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1987లో తయారైన మాస్టర్ ప్లాన్‌ను పట్టణ మౌలిక అవసరాల మేరకు 2014లో రూపొందించిన నూతన మాస్టర్ ప్లాన్‌ను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆమోదం ఇవ్వకుండా కాలయాపన చేసిందన్నారు. తద్వారా పట్టణ ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 132 మునిసిపాలిటీల్లో నూతన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాల్సిందిగా పైలెట్ ప్రాజెక్టుగా గత ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏ ఒక్క మునిసిపాలిటీలో కూడా మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం తెలపలేదన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక చొరవతోనే నల్లగొండ మునిసిపాలిటీకి నూతన మాస్టర్ ప్లాన్ ఆమోదం లభించిందన్నారు. మునిసిపల్ కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి రావాల్సిన స్టాంప్ డ్యూటీ రూ. 22కోట్ల చెక్కును ట్రెజరీ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఈ కుబేర్ విధానంతో చెక్కు పాస్ కావడానికి సమయం పట్టిందన్నారు. విషపూరిత ప్రచారాలు చేయవద్దని హితవు పలికారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సమావేశంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మాజీ కౌన్సిలర్లు ఖయ్యూం బేగ్, ఇంతియాజ్, నాయకులు సయ్యద్, జూలకంటి శ్రీనివాస్, అమీర్ పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి కృషి

నాంపల్లి ఫిబ్రవరి 1, (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తునట్లు డీఆర్‌డీఏ ఏపీడీ శారద అన్నారు. శనివారం మండలంలోని మహ్మదాపురంలో గల దేవాలయ భూముల్లో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం మహిళా సంఘల ద్వారా సోలార్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మహిళా సంఘల ద్వారా చేయడంతో మహిళలు వ్యాపారస్తులుగా మరే అవకాశముదన్నారు. ఈ కార్యక్రమంలో సోలార్ డిస్ట్రిక్ మేనేజర్ పాండురంగరావు, తహసీల్దార్ దేవాసింగ్, వినోద్, ఇందిర, సత్యనాయణ, ప్రవీణ్ తదితరులున్నారు.

సమాజసేవలో పాల్గొనాలి

చిట్యాల, ఫిబ్రవరి 1, (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సమాజసేవలో పాల్గొనాలని రోటరీక్లబ్ చిట్యాల అధ్యక్షుడు గుండెబోయిన సైదులు కోరారు. చిట్యాలల ఐదుగురు విద్యార్థినులకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి కంభంపాటి నర్సింహ, కోశాధికారి ఎడ్ల శ్రీశైలం, మారగోని రమేష్, మందడి జనార్ధన్‌రెడ్డి, కసిరెడ్డి రాజు, గుండెబోయిన శివసాయి తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్య మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు



మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

శాలిగౌరారం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఉప్పలంచ మాజీ సర్పంచ్ బండారు మల్లయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని ఉప్పలంచలో శనివారం నిర్వహించిన మాజీ సర్పంచ్ మల్లయ్య సంతాపసభలో మాట్లాడారు. మల్లయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. మంత్రి వెంకట్‌రెడ్డి రూ.లక్ష, ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి రూ.50వేలు, ఎమ్మెల్యే సామేల్ రూ.50వేలు, కాంగ్రెస్ మండల నాయకులు సేకరించిన రూ.1.25 లక్షలను కుటుంబసభ్యులకు అందజేశారు. మల్లయ్యను హత్య చేసిన వారిని కఠిన శిక్ష విధించే వరకు న్యాయ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, బండపల్లి కొమరయ్యగౌడ్, షేక్ ఇంతియాజ్ అహ్మద్, సీఎంరెడ్డి, జైపాల్‌రెడ్డి, గుని వెంకటయ్య పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తిచేయాలి



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు లక్ష్మయ్య

చిట్యాల, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): చిట్యాలలో జాతీయరహదారిపై నిర్మించనున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను వెంటనే పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య కోరారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం మునిసిపల్ కమిషనర్ వీరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ పనులు చేపట్టడం కోసం సర్వీస్ రోడ్డు వెంట ఉన్న వీధీ దీపాలను తొలగించారని, దీంతో రాత్రి సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనుల వల్ల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెల్ల లింగస్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, నాయకులు జిట్ట బొందయ్య, రుద్రవరం యాదయ్య, ఆగు అశోక్, సాయిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, బొల్లగొరి సైదులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

● మర్రిగూడ : మండలంలోని మేటిచందాపురం, కొట్టాల, సరంపేట గ్రామాలను కలిపి ప్రత్యేక ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలని మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీను కోరారు. మునుగోడు క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిసి విన్నవించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రాపోలు యాదగిరి, మల్లేష్, మాజీ సర్పంచ్ లక్ష్మీప్రసన్న రవి, యాదయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

● మర్రిగూడ :మండలంలోని నామాపురం ఎంపీటీసీ పరిధిలో ఉన్న మేటిచందాపురం, కొట్టాల గ్రామపంచాయతీలను శివన్నగూడెం ఎంపీటీసీ పరిధిలో చేర్చాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. శనివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నామాపురం మాజీ ఎంపీటీసీ సరితనగేష్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు చెరుకు లింగంగౌడ్, ఏరుకొండ లింగస్వామి, ఏరుకొండ అబ్బయ్య, బిక్షం, లవంగి సాయి, లవంగి శివ పాల్గొన్నారు.

● కట్టంగూరు : కట్టంగూరులోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డిపల్లి మనోహర్ తెలిపారు.ఈనెల 8న రాత్రి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

● కట్టంగూరు : కట్టంగూరుకు చెందిన బత్తిని అంజయ్య అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో పెద్ది ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ పెద్ది బాలనర్సింహగౌడ్ రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు చెవుగోని జనార్ధన్, అంతటి శ్రీను, రెడ్డిపల్లి మనోహర్, పొడిచేటి సైదులు, పోగుల అంజయ్య, శ్రీను, సాయి పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో ఈ నెల 17, 18వ తేదీల్లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను నిర్వహించనున్న ట్లు ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ము స్కు రవీందర్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సమావేశంలో ముస్కు రవీందర్, అరుణ్‌తేజ్, అన్వేశ్, హరీశ్, అనిల్, ఉపేందర్, తరుణ్, వంశీ, సందీప్, మధు పాల్గొన్నారు.

● చిట్యాల: ప్రతి ఒక్కరూ సమాజసేవలో పాల్గొనాలనీ రోటరీక్లబ్ ఆఫ్ చిట్యాల అధ్యక్షుడు గుండెబోయిన సైదులు కోరారు. శనివారం చిట్యాలలోని ఐదుగురు విద్యార్థినులకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి కంభంపాటి నర్సింహ్మా, కోశాధికారి ఎడ్ల శ్రీశైలం, మారగోని రమేష్, మందడి జనార్ధన్‌రెడ్డి, కసిరెడ్డి రాజు, గుండెబోయిన శివసాయి తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడు భవన నిర్మాణ కార్మికుల హక్కుల సాధన కోసం ప్రభుత్వం శ్రద్ధ చూపాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు చాపల శ్రీను డిమాండ్ చేశారు. శనివారం మునుగోడు సీపీఐ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఈద యాదయ్య, ఏర్పుల నర్సింహా, యాసరాణి శ్రీను, పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్ : పైలాన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలనుఎంఈవో తరి రాము శనివారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గణేశ్వరి తన తండ్రి లక్ష్మయ్య జ్ఞాపకార్థం రూ.5,000ల విలువైన బ్యాడ్జీలు, బెల్టులను అందజేశారు. కాగా పదవీ విరమణ పొందిన అటెండర్ నీలమ్మను సన్మానించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శేషు, రమణి, యాదగిరి పాల్గొన్నారు.

● చండూరురూరల్ : సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, చండూరు మాజీ వైస్ ఎంపీపీ మందడి నర్సింహారెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నెల్లికంటి సత్యం అన్నారు. మండలంలోని పుల్లెంల గ్రామంలో శనివారం నిర్వహించిన నర్సింహారెడ్డి ద్వితీయ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● చిట్యాలరూరల్: మండలంలోని వట్టిమర్తిలో మాజీ సర్పంచ్ రాచమల్ల రామచంద్రం స్మారకార్థం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు అట్లాస్, పరీక్షప్యాడ్‌లు, పెన్నులు, విద్యాసామగ్రిని శనివారం డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పంపణీ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య, డాక్టర్ నర్రా ప్రవీణ్‌రెడి ప్రధానోపాధ్యాయుడు పందిరి రమేష్ బూరుగు గోపీకృష్ణ, రాచమల్ల శేఖర్ పాల్గొన్నారు.

● కనగల్ : మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం శనివారం ప్రారంభించారు. సాయంత్రం పూట క్లాసులకు హాజరయ్యే విద్యార్థుల ఆకలి బాధలను దృష్టిలో ఉంచుకుని రోజుకో రకం అల్పాహారం అందజేస్తామని ఎంఈఓ పద్మ తెలిపారు. ఉడకబెట్టిన శనగలు, పెసర్లు, పల్లిపట్టీలు, మిల్లెట్లబిస్కెట్లు, పకోడి వంటి అల్పాహారాలను ప్రత్యేక తరగతులు కొనసాగే మార్చి 20 వరకు అందిస్తామన్నారు.

మా భూమిని అక్రమంగా కాజేశారు

● మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన రైతు

మంగళ్‌హాట్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తన భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఓ బాధిత రైతు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాడు. గట్టుప్పల్‌కు చెందిన బాధిత రైతు జెల్లా యాదయ్యకు వారసత్వంగా వచ్చిన భూమిని అక్రమంగా కాజేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు వచ్చిన 2.34 ఎకరాల భూమిని తమ గ్రామానికి చెందిన ఆరుగురు కబ్జా చేసి అధికారులతో కుమ్మక్కై ధరణిలో వారి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. స్థానికంగా రాజకీయ అండదండలతో అధికారులపై ఒత్తిడి చేసి ధరణిలో పేర్లు నమోదు చేయించుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయం గట్టుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మాదిగల మహాసభను విజయవంతం చేయాలి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): లక్ష డప్పులు...వేల గొంతుల పేరిట ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లో మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో నిర్వహించే మాదిగ సాంస్కృతిక మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మేడి నర్సింహ పిలుపునిచ్చారు. నార్కట్‌పల్లిలో శనివారం నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు బోడ ఎల్లయ్య, చింత లక్ష్మణ్, బోడ శంకర్, మేడి శంకర్, చిరుమర్తి ఉపేందర్, జిల్ల చిన్న, ఇంద్రకంటి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గట్టుప్పల్ మండలంలో ఎంపీటీసీల సంఖ్య పెంచాలి

గట్టుప్పల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన గట్టుప్పల్ మండలంలో ఎంపీటీసీల సంఖ్య పెంచాలని బీజేపీ మండల అధ్యక్షుడు రావుల ఎల్లప్ప డిమాండ్ చేశారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో మాధవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతంపేటను ప్రత్యేక ఎంపీటీసీ స్థానంగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిలువేరు దుర్గయ్య, కంపె దుర్గయ్య, నాగులగాని శ్రీనివాస్, గుర్రం ప్రదీప్‌కుమార్, జంపాల సుధాకర్, రాజు, సురేష్ పాల్గొన్నారు.

పద్మశాలీల సమస్యలను పరిష్కరించాలి

నాంపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పద్మశాలీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు కోట రఘునందన్ అన్నారు. మండలకేంద్రంలోని మార్కండేయస్వామి దేవాలయం వద్ద శనివారం నిర్వహించిన సమావేశంలో పద్మశాలీ సంఘం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీ సంఘం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు గుర్రం గణేష్, కర్నాటి నాగరాజు, గుర్రం వెంకటేష్, గోలి కృష్ణ, సంగెపు గణేష్, సంగెపు మల్లేష్, కోట అయోధ్య, వెంకటేష్, గుర్రం బిక్షమయ్య, శ్రీనివాసులు, భారతయ్య, పాపయ్య, రంగయ్య, రాజమల్లు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకుసాగాలి : సీఐ

మర్రిగూడ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గమ్యం చేరాలంటే మంచి లక్ష్యం కలిగి ఉండాలని నాంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాల, జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేసిన స్టడీ మెటీరియల్‌ను శనివారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతమైన చదువులు చదవాలనే లక్ష్యంతో పీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ తెల్లం పాండురంగారావు ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కృష్ణారెడ్డి, డీటీ తారక్‌రామన్, హెచ్‌ఎం శివస్వరూపరాణి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో స్థూపం నిర్మిస్తున్న వారిపై కేసు నమోదు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో అక్రమంగా స్మారక స్థూపం నిర్మిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో ఇటీవల ఆ గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ, సీపీఎం సీనియర్ నేత కల్లూరి యాదగిరి మృతి చెందాడు. యాదగిరి స్మారకార్థం సర్వే నెంబర్ 280లో స్థూప నిర్మాణం చేపట్టారు. అయితే అది ప్రభుత్వ స్థలం కావడంతో తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు స్థూప నిర్మాణం చేపట్టిన వారిపై కేసు నమోదు చేసనట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కుంభమేళాలో స్నానాలు



రాజగోపాల్‌రెడ్డి ఫ్లెక్సీతో పుణ్యస్నానం చేస్తున్న ఆచరిస్తున్న అభిమాని కిరణ్

చండూరు, చండూరురూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై అపారమైన అభిమానం చాటుకున్నాడు చండూరు మండలానికి చెందిన ఓ అభిమాని. చండూరు మండలం శిర్దేపల్లి గ్రామానికి చెందిన లింగోజు కిరణ్‌కుమార్ అనే వ్యక్తి రాజగోపాల్‌రెడ్డిపై అ పారమైన అభిమానంతో ఆయనకు మంత్రి పదవి రావాలని ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా శనివారం ఆయన రాజగోపాల్‌రెడ్డి ఫ్లెక్సీతో కలిసి మహాపుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి వచ్చే వరకు తనవంతు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతూ ఉంటానని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

కుల వివక్షతోనే 'మధ్యాహ్న' కార్మికుల తొలగింపు



సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున

నల్లగొండరూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కులవివక్షతో, దళితులు అనే నెపంతో మధ్యాహ్న భోజన వంట కార్మికులను తొలగించారని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున ఆరోపించారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. మునుగోడు మండలంలోని కొంపల్లి గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం ముగ్గురు కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. విద్యార్థులకు ఉడకబెట్టిన గుడ్లు ఇవ్వడం లేదనే కారణం చూపుతున్నారని అ న్నారు. ఈ చర్యపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ కేసులు న మోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, నాయకులు పోలే సత్యనారయణ, అంజమ్మ పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు
దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.131	210	240
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 । కనిష్ఠం 18.8



కనికరించని నిర్మలమ్మ

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ శనివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి జిల్లావాసుల ఆశలపై నీళ్లు చల్లింది. ఉమ్మడి జిల్లాకు కేంద్రం నుంచి ఆశించిన ఏ పథకం, ప్రాజెక్టు గురించి బడ్జెట్ ప్రసంగంలో కనీస ప్రస్తావన లేకపోవడం నిరాశ కలిగించింది. ప్రత్యేక పథకాల ప్రస్తావన లేకపోయినా, ఆదాయపన్ను సవరణలు, స్వయం సహాయక సంఘాలు, అర్బన్ పేదలకు క్రెడిట్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయించడం, గిగ్‌వర్కర్లకు శ్రమ్‌పోర్టల్ ద్వారా కార్డుల పంపిణీ, ఆరోగ్యబీమా వర్తింజేయాలనే నిర్ణయాలు కొంత ఊరట కలిగించాయి. అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు తీసుకోవాలనే కేంద్ర నిర్ణయంపై కూడా హర్షం వ్యక్తమైంది.
- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ప్రత్యేక కేటాయింపులే లేవు
- పేద, మధ్యతరగతి వర్గాలకు ఊరటనిచ్చిందని పలువురి అభిప్రాయం
- కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమస్పందన

పేద, మధ్యతరగతివర్గాలకు, వేతన జీవులకు ఊరటకలిగేలా ఆదాయపన్ను రాయితీ పరిధి పెంచడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వ్యక్తిగత ఆదాయపన్నును రూ.12లక్షల వరకు మినహాయించారు. స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపి రూ.12.75 లక్షల వరకు ఈ పన్ను మినహాయింపు ఉంటుంది. దీంతో పేద, మధ్యతరగతివర్గాలకు కనీసం రూ.70వేల వరకు ఏటా లబ్ధి చేకూరనుంది. దీంతో వ్యాపారులతో పాటు ఉమ్మడి జిల్లాలోని 60వేల మంది ఉద్యోగులకు ఇది ఊరటనిచ్చే అంశం. వీరితో పాటు పట్టణాల్లో నివసించే మధ్యతరగతివర్గాలకు అద్దెలపై వచ్చే ఆదాయంపై రూ.6లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు లభించింది.

తగ్గనున్న మొబైల్స్, ఎల్సీడీల ధరలు

సుంకాలు తగ్గించడంతో మొబైల్ ఫోన్లు, ఎల్సీడీలు, ఎల్ఈడీలు, ఎలక్ట్రిక్‌వాహనాలు, క్యాన్సర్ ఇతర ప్రాణాంతక ఔషధాలు, లెదర్ వస్తువులు, దేశీయంగా ఉత్పత్తి అయ్యే...
- మిగతా 8వ పేజీలో...

కొంతమోదం, కొంత ఖేదం



కేంద్ర బడ్జెట్ మిశ్రమంగా ఉంది. కొన్ని వర్గాలకు ఊరట కలిగిస్తే, మరికొన్ని వర్గాల గురించి కనీస ప్రస్తావన కరువైంది. ఆదాయపన్ను పరిమితిని రూ.12లక్షలకు పెంచడం మధ్యతరగతి వర్గాలకు ఊరట కలిగించే అంశం. మానవ వనరులను పెంచే విద్యవైద్య రంగాలకు కేటాయింపుల్లో కేంద్రం వివక్ష చూపింది. మొత్తం బడ్జెట్‌లో విద్యారంగానికి 2.54శాతం, వైద్య రంగానికి 1.94శాతం మాత్రమే కేటాయింపులు చేయడం శోచనీయం. కొఠారీ కమిషన్ సిఫార్సులను కనీసం పట్టించుకోలేదు.
- డాక్టర్ అక్కినేపల్లి మీనయ్య, నల్లగొండ ఎకనామిక్స్ ఫోరం అధ్యక్షుడు

మధ్యతరగతికి ఊరట



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ మధ్యతరగతి, అల్పాదాయం, పారిశ్రామిక, వ్యాపారవర్గాలను దృష్టిలో పెట్టుకొని రూపకల్పన చేసినట్టు ఉంది. ఇటీవల కాలంలో మధ్యదిగువ తరగతి ప్రజల కొనుగోలు శక్తి బాగా దెబ్బతిన్నది. ఆ మేరకు పారిశ్రామిక ఉత్పత్తులు తగ్గి జాతీయ స్థూల ఆదాయం ఆశించినదానికంటే తక్కువగా నమోదైంది. దీంతో ఆర్థిక మంత్రి మధ్య, దిగువ తరగతి ప్రజల కొనుగోలు శక్తిని పెంచేలా కసరత్తు చేశారు. రూ.12లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం ప్రజలకు ఊరట కలిగించింది.
- పెద్దిరెడ్డి గణేష్, బ్యాంకింగ్‌రంగ నిపుణులు

చేనేత రంగంపై చిన్నచూపు

(ఆంధ్రజ్యోతి, మోత్కూరు): దేశంలో వ్యవసాయం తర్వాత చేనేత రంగం ప్రధానమైనది కాగా, కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపుల విషయంలో ఆర్థికశాఖ మంత్రి నిర్మాలా సీతారామన్ చిన్నచూపు చూశారు. పేరు చేనేతది, నిధులు టెక్స్‌టైల్‌కు అనేలా బడ్జెట్ ఉంది. టెక్స్‌టైల్ రంగానికి రూ.5,272 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. అందులో చేనేతకు కేవలం రూ.200కోట్లు మాత్రమే దక్కనున్నాయి. గత ఏడాది బడ్జెట్‌లోనూ చేనేతకు రూ.200కోట్లే కేటాయించారు. టెక్స్‌టైల్ రంగానికి బడ్జెట్ పెంచుతున్న ప్రభుత్వం చేనేత రంగాన్ని మాత్రం విస్మరిస్తోందని చేనేత సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చేనేతకు కేటాయించిన నిధులు ఉద్యోగుల జీతభత్యాలకే సరిపోతాయంటున్నారు. దేశంలో 1.83కోట్లు, రాష్ట్రంలో సుమారు 50వేల కుటుంబాలు, ఉమ్మడి జిల్లాలో సుమారు 15వేల కుటుంబాలు చేనేత పై ఆధారపడ్డాయి. చేనేతకు నిధులు పెంచకపోవడంతో ఈ రంగం మరింత సంక్షోభం లో కూరుకుపోయి రోడ్డున పడతామని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. చేతివృత్తులను కాపాడతామని చెబుతున్న మోదీ ప్రభుత్వం చేనేతరంగానికి నిధులు పెంచకుండా నిర్వీర్యం చేస్తోంది. చేనేత సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ చేనేత సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కార్మిక సంఘాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. బడ్జెట్‌లో చేనేత కార్మికులకు ఉపాధి, కనీస వేతనాల ఊసే లేదు. చేనేతకు రిజర్వ్ అయిన 11 రకాల వస్త్రాలను మిల్లుల్లో తయారు చేయకుండా అజమాయిషీ చేసే ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో ప్రభుత్వం పరోక్షంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థను నిర్వీర్యం చేసినట్టేనని చేనేత సంఘాల నేతలు విమర్శిస్తున్నారు.



నిధులు, రైల్వే కేటాయింపులే లేవు..



(ఆంధ్రజ్యోతి, యాదాద్రి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్త ప్రాజెక్టులు రాకపోగా, పాత వాటికి నిధులు కేటాయించలేదు. ప్రధానంగా ఏళ్లుగా రైల్వే వ్యవస్థ ఆధునికీకరణ, ఎంఎంటీఎస్ సేవల పెంపు కోసం ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. యాదాద్రి జిల్లా ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. భువనగిరి ఖిల్లాతోపాటు యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, జైనమందిరం, శైవాలయాలు, స్వర్ణగిరి దేవాలయాలు ఉన్నాయి. హైదరాబాద్ నగరానికి చేరువలో ఉండటంతో జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తారని ప్రజలు ఆశాభావంతో ఉన్నారు. అయితే కేంద్ర బడ్జెట్ జిల్లా వాసులను నిరాశపరిచింది. మూసీ నది కాలుష్యం కారణంగా పరివాహక ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూసీ నీటి శుద్ధీకరణకు కేంద్రం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుందని ఈ ప్రాంత ప్రజలు ఆశించినా నిరాశే మిగిలింది. జిల్లాలో చేనేత కార్మికులు అధికంగా ఉండగా, చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ ఎత్తివేస్తారని నేత కార్మికులు ఆశించగా, కేంద్రం మాత్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్మించనున్న రీజనల్ రింగ్‌రోడ్డుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. భూసేకరణ, రోడ్డు నిర్మాణ పనులు కేంద్రం నిర్ణయంతో ముందుకు సాగనున్నాయి. రైతులు పంట సీజన్ ప్రారంభంలో రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతుంటారు. రుణాలు లభించక వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేస్తున్నారు. అయితే కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు పంటల సాగు కోసం పెట్టుబడులు అవసరమైనప్పుడు అధిక వడ్డీతో అప్పులు చేయకుండా, తక్కువ వడ్డీకే రుణాలు పొందేందుకు కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5లక్షల వరకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో జిల్లాలోని 2.50లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. తక్కువ ఉత్పాదక, పంట దిగుబడి మధ్యస్థంగా ఉండే వెనుకబడిన 100 జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం అందించేందుకు పీఎం ధన ధాన్య కృషి యోజనను కేంద్రం ప్రకటించింది. ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టనుండగా, రైతులకు ప్రోత్సాహకాలు అందనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో గోదాములు, నీటిపారుదల, రుణ కల్పన, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, పంచాయతీలు, నియోజకవర్గాల స్థాయిల్లో పండించిన పంటలను నిల్వ చేయడం ద్వారా రైతులకు లబ్ధి చేకూర్చడం దీని లక్ష్యం. పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంటుందని ఆశించినా, ప్రభుత్వం యథావిధిగా కొనసాగించింది. ఆదాయ పన్ను మినహాయింపుతో జిల్లాలో సుమారు 3వేల మందికి ప్రయోజనం చేకూరనుంది.

నల్లగొండలో నగరోత్సవం

- చెర్వుగట్టు జాతరలో నేడు మొదటి ఘట్టం



చెర్వుగట్టు వ్యూ

•8లో..

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్న అధికారులు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శనివారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల స్థానానికి, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ స్థానానికి ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం రాజకీయ నాయకులకు చెందిన హోర్డింగులు, జెండాలు, గోడ రాతలు, ఫ్లెక్సీ ప్రకటనలు తొలగించాలన్నారు. ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్, 10న నామినేషన్లు, 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13వ తేదీన ఉపసంహరణ, 27వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారని, మార్చి 3న ఫలితాలు వెల్లడిస్తారని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ స్థానానికి నల్లగొండ కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

వరంగల్- ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఆర్జాలబావి వద్ద ఉన్న వేర్ హౌసింగ్ గోదాములో ఏర్పాట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి వేర్ హౌసింగ్ గోదామును ఆమె పరిశీలించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రి సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లను పరిశీలించారు.

విధులకు నై, క్రికెట్ పోటీలకు సై

•8లో..

- డ్యూటీకి డుమ్మా కొట్టి బ్యాట్, బాల్ పట్టిన 64మంది కార్యదర్శులు
- సాగర్ నియోజకవర్గంలో వెలుగులోకి
- పలువురికి షోకాజ్‌లు

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు తప్పిన బహిష్కరణ ముప్పు

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలకు ప్రైవేటు కళాశాలల బహిష్కరణ ముప్పు తప్పింది. ప్రాక్టికల్స్ పరీక్షా కేంద్రాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు జారీ చేసిన ఉత్తర్వులపై ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కన్నెర్ర చేశాయి. పరీక్షలకు 15 రోజుల ముందు జారీ చేసిన ఉత్తర్వులతో ఒక్కో ప్రైవేట్ కళాశాలపై రూ.80వేల ఆర్థిక భారం పడుతుంది. ఇప్పటికే మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండి కళాశాలల నిర్వహణ భారంగా మారింది.
- (ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్)



- ఏడాదిపాటు సీసీ కెమెరాల బిగింపు వాయిదా
- రేపటి నుంచి 22 వరకు ప్రాక్టికల్స్

అప్పులు చేసిన తమపై సీసీ కెమెరాల పేరుతో అదనపు భారం మోపవద్దని, ఈ నిబంధనను ఏడాది పాటు వాయిదా వేయాలని నిరసనలు చేపట్టి ప్రాక్టికల్స్ పరీక్షల బహిష్కరణాస్త్రాన్ని కళాశాలల యాజమాన్యాలు ప్రయోగించాయి. దీంతో శనివారం హైదరాబాద్‌లో ఇంటర్ బోర్డు కమిషనర్‌తో జరిగిన చర్చల్లో సీసీ కెమెరాల బిగింపు మరుసటి ఏడాదికి వాయిదాపడింది. దీంతో సోమవారం నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు యథావిధిగా ప్రారంభం కానున్నాయి.

31,349 మంది విద్యార్థులు, 193 పరీక్షా కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలోని 271 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్, ఒకేషనల్ కోర్సులు చదువుతున్న 31,349 మంది విద్యార్థులు ఈ ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ నెల 3 నుంచి 22వ తేదీ వరకు మూడు దఫాలుగా, రెండు పూటలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, తిరిగి సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. అందుకు 193 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అబ్జర్వర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. ప్రభుత్వ కళాశాలలన్నింటిలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఎంపిక చేసిన ప్రభుత్వ యాజమాన్య కేజీబీవీ, గురుకుల తదితర సెక్టార్ కళాశాలలు, ప్రైవేట్ కళాశాలల్లో మరికొన్ని పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా మార్చి 5వ తేదీ నుంచి థియరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

సీసీ కెమెరాల బిగింపు వివాదం, పరిష్కారం వెనుక?

ఇంటర్ సైన్స్ కోర్సుల్లో ప్రాక్టికల్స్ అత్యంత విలువైనవి. తరగతి గదుల్లో నేర్చుకున్న పాఠ్యాంశాలపై ల్యాబ్‌లో చేసే ప్రయోగాలతో మరింత స్పష్టత, అవగాహన వస్తుంది. అంతేగాక పరిశోధనాసక్తి పెరిగే అవకాశం ఉంటుంది. ఈ మేరకు అన్ని కళాశాలల్లో ఫిజిక్స్.
- మిగతా 8వ పేజీలో...

జిల్లా	కళాశాలలు	పరీక్షా కేంద్రాలు	విద్యార్థులు
నల్లగొండ	132	107	16,800
సూర్యాపేట	74	44	8,349
యాదాద్రి	65	42	6,200
మొత్తం	271	193	31,349

పకడ్బందీగా ప్రాక్టికల్స్ పరీక్షలు



ప్రాక్టికల్స్ పరీక్షలకోసం పకడ్బందీ ఏర్పాట్లుచేశాం. అవకతవకలకు ఆస్కారం లేకుండా నిఘా పెట్టాం. 3 స్పెల్స్‌గా నిర్వహించే ప్రాక్టికల్స్ కోసం అబ్జర్వర్స్, తదితర నియామకాలు పూర్తి చేశాం. విద్యార్థుల ప్రతిభ ఆధారంగానే మార్కులు కేటాయించాలని నిర్దేశించాం. ప్రైవేట్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టాం. పరీక్షల నిర్వహణ, మార్కుల కేటాయింపులో అక్రమాలకు పాల్పడితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.
- రమణి, యాదాద్రి జిల్లా ఇంటర్ నోడల్ అధికారి

భక్తులకు అన్ని వసతులు కల్పించాలి



చెర్వుగట్టుపై జాతర ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్రపవార్

చెర్వుగట్టుకు జాతరకు 3లక్షల మంది వస్తారని అంచనా
కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): చెర్వుగట్టు ఆలయ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అధికారులను ఆదేశించారు. నేటినుంచి చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల దృష్ట్యా ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. తొలుత వాహన పార్కింగ్, టికెట్, ప్రసాద కౌంటర్లు, కల్యాణ మండపం, క్యూలైన్, తలంబ్రాలు సమర్పించేందుకు భక్తులు వచ్చే క్యూలైన్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాలకు సుమారు 3లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేశామన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, అత్యవసర సేవలు 24గంటలు అందేలా చూస్తామన్నారు. సుమారు 1,500 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంతకుముందు రామలింగేశ్వరుడి మూలవిరాట్టును కలెక్టర్, ఎస్పీ దర్శించుకోగా వారికి ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ వేదాశీర్వచనం చేశారు. వారి వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, ఆలయ ఈవో సిరికొండ నవీన్‌కుమార్, ఏసీ భాస్కర్, నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఆర్ఐ తరుణ్, తదితరులు ఉన్నారు. అదేవిధంగా చెర్వుగట్టు శివారులోని పోతులపాటి సోమశర్మ శివ జ్ఞాన పీఠాన్ని కలెక్టర్, ఎస్పీ సందర్శించారు.

బాలకార్మికుల చేరదీత

ఆపరేషన్ స్మైల్ ద్వారా 99 మందికి విముక్తి
చిన్నారులను పనిలో పెట్టుకున్న 61మందిపై కేసు

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ స్మైల్-11వ విడత జిల్లాలో విజయవంతంగా నిర్వహించినట్లు ఎస్పీ శరత్ చంద్రపవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ డివిజన్లలో మూడు ప్రత్యేక బృందాలు బాలకార్మికుల కోసం తనిఖీలు నిర్వహించి జిల్లాలో మొత్తం 99మంది బాలకార్మికులను గుర్తించామని పేర్కొన్నారు. హోటళ్లు, ఇటుక బట్టీలు, బేకరీలు, మెకానిక్ షాపులతో పాటు వివిధ పనులు చేస్తూ వెట్టిచాకిరీకి గురవుతున్న బాలకార్మికులను గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. బాల కార్మికుల్లో 11 మంది బాలికలు, 88 బాలురు ఉన్నారని తెలిపారు. చిన్నారులను పనిలో పెట్టుకుని వెట్టిచాకిరీ చేయిస్తున్న 61మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. చిన్నారులను ఎవరైనా పనిలో పెట్టుకుంటే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

జాతరలకు వేళాయె...

- **నేటి నుంచి మండలంలో ఆధ్యాత్మిక శోభ**
- **గ్రామాల్లో ప్రారంభమైన సందడి**
- **కళాకారులు, చిరువ్యాపారులకు ఉపాధి**

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ ముగిసింది. జాతరల పండుగ మొదలైంది. ఇక ఉమ్మడి మండలవ్యాప్తంగా జాతరలు జరగనున్నాయి. మాఘమాసం మొదలు కావడంతో మండలంలోని బాలాజీనగర్ వేంకటేశ్వరస్వామి, మేడారం లక్ష్మీనర్సింహస్వామి, కోదండపురం వేంకటేశ్వరస్వామి జాతరలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

లక్ష్మీనరసింహస్వామి ఆలయం ముస్తాబు

మండలంలోని మేడారం గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తారు. ఫిబ్రవరి 1 నుంచి 5వ తేదీ వరకు కొనసాగే ఉత్సవాల సాగనున్నాయి. ఈ నేపథ్యంలో దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. నిత్య పూజలు, భక్తుల సందడితో వెలుగొందుతున్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తుల రానున్నారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. అయిదు రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాల వివరాలను దేవస్థాన కమిటీ చైర్మన్ యల్గూరి చెన్నారెడ్డి వెల్లడించారు. 1, 2వ తేదీన నిత్య హోమం, దీపారాధన, 3న కల్యాణోత్సవం, 5న రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానం ముస్తాబు

మండలంలోని మేడారం గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు కొనసాగే ఉత్సవాల కోసం దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. నిత్య పూజలు, భక్తుల సందడితో వెలుగొందుతున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తుల రాక నేపథ్యంలో నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. అయిదు రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాల వివరాలను దేవస్థాన కమిటీ చైర్మన్ ఎమ్. బిచ్యానాయక్ వెల్లడించారు. 5న డేరా కార్యక్రమం, 6న శ్రీ సీతారామ చంద్రస్వామి పూజా కార్యక్రమం, 8న కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

గోదాదేవిల సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

మండలంలోని కోదండపురం గ్రామంలో గల పద్మావతీ గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం రెండో తిరుపతిగా భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17నుంచి ప్రారంభం కానున్నాయి. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన జీయర్‌స్వామి ఆలయాన్ని దర్శించి మంగళశాసనము చేసినటువంటి ఈ దేవాలయంలో 17న స్వామివారికి అధ్యయనోత్సవం, తొళ్లక్కంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 18న గరుడసేవ, పరమపదోత్సవము, 20న తేదీ తెల్లవారుజామున స్వామి వారి కల్యాణోత్సవం, 21న గజవాహనసేవ, రథోత్సవం, 22న శేషవాహన సేవ, 23న పూర్ణాహుతి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గజ్జెల వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆలయ పూజారి కోమండురి శ్రీనివాసాచార్యులు, శ్రీకాంత్‌చార్యుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గజ్జెల వెంకటేశ్వరరెడ్డి అన్నారు. జాతర సందర్భంగా కబడ్డీ, ఆర్కెస్ట్రా, కోలాటం, భజనలు, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా తగిన జాగ్రత్తలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.



ఉత్సవాలకు ముస్తాబైన మేడారం లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం

బాధ్యతల స్వీకరణ



కరుణాకర్‌రావు

అడవిదేవులపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల ఎంపీడీవోగా పి.కరుణాకర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతం లో ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా మోసిన్‌బిన్‌అహ్మద్ పనిచేయగా మిర్యాలగూడ ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పి.కరుణాకర్‌రావు బదిలీపై ఇక్కడికి వచ్చారు. అడవిదేవులపల్లి మండల నూతన ఎంపీడీవోగా పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందించేలా తనవంతు కృషి చేస్తానని అన్నారు. బాధ్యతలు స్వీకరించిన నూతన ఎంపీడీవో కరుణాకర్‌రావుకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పీడీఎస్ బియ్యం వ్యాపారుల అరెస్ట్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): చిన్న వ్యాపారస్థుల నుంచి పీడీఎస్ బియ్యం కొని ఆంధ్రా ప్రాంత వ్యాపారులకు విక్రయిస్తున్న ఇరువురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన నిందితుల వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ మండలం జంకుతండాకు చెందిన ధనావత్ నరేందర్, వెంకటాద్రిపాలెం చౌట్లతండాకు చెందిన కేతావత్ సురేష్ పీడీఎస్ బియ్యం వ్యాపారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆంధ్ర ప్రాంత వ్యాపారులకు అమ్ముతున్నారని తెలిపారు. జనవరి 31వ తేదీన వెంకటాద్రిపాలెం దిలావర్‌పూర్ క్రాస్‌రోడ్డు వద్ద రాత్రి 7గంటల సమయంలో రూరల్ ఎస్‌ఐ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో ధనావత్ నరేందర్, కేతావత్ సురేష్ అంతకుమందు చిన్నవ్యాపారుల వద్ద కొని సురేష్ ఇంట్లో నిల్వ ఉంచిన 55 క్వింటాళ్ల బియ్యాన్ని టాటా ఇంట్రా మినీ వాహనంలో తరలిస్తుండగా నిందితులను పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ధనావత్ నరేందర్‌పై 2019 నుంచి 10 కేసులు నమోదైనట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశానుసారం అతనిపై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో రూరల్ సీఐ వీరబాబు, ఎస్‌ఐ లోకేష్, సిబ్బంది సైదులు, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్, సైదానాయక్ ఖాజాలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎంవీఐ



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంవీఐ వీరస్వామి

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక, మానసికోల్లాసం పొందవచ్చని ఎంవీఐ వీరస్వామి అన్నారు. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించి న క్రీడోత్సవ ముగింపు కార్యక్రమానికి ఆయన షీటీమ్ ఎస్‌ఐ నరేష్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో కూడా రాణించాలని అన్నారు. ఆటలు ఆడితే ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, త ద్వారా చదువులో రాణించగలుగుతారన్నారు. షీటీమ్ ఎస్‌ఐ నరేష్ మాట్లాడుతూ ఫిట్‌గా ఉంటేనే ఏదైనా సాధించగలుగుతామని, అందుకు క్రీడాసాధన చేయాలన్నారు. విద్యార్థులు పాఠశాల చదువు పూర్తి చేసేంత వరకూ స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించి, ఉత్తమ క్రీడోత్సవంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కేకే. జయరాజన్, జిస్సీసయరాజన్, హెచ్‌ఎం సుజయ్‌కుమార్, పీఈటీలు శివశంకర్, రాధిక, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ రాంమ్మూర్తి అన్నారు. కొండమల్లేపల్లిలో శనివారం నిర్వహించిన ఆటో డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. నల్లగొండ రోడ్డు వైపు పలు గ్రామాలకు వెళ్లే ఆటోకార్మికులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఆటో వాలాలు సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, మద్యం తాగి వాహనాలు నడపరాదని ఆయన సూచించారు. సమావేశంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు ఆదిరాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జంగయ్య, ఆటో కార్మికులు శ్రీరాములు, కొండల్, పెద్దిరాజు, సంజీవ, రామకృష్ణ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సంప్రదాయాలు తెలియజేయాలి

హాలియా, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలియజేయాలని ధర్మ జాగరణ సమితి రాష్ట్ర నాయకుడు రాయపోలు మురళీశర్మ అన్నారు. హాలియా మునిసిపాలిటీలోని న్యూకిడ్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన మాతృపాద పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లితండ్రుల పాదాలను కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. విద్యార్థులకు విద్యతో పాటు తల్లితండ్రులపై భక్తి, విశ్వాసాలను పెంపొందే విధంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మనాది రవీందర్, హెచ్‌ఎం శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని అమలుచేయాలి

- **సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్**



మిర్యాలగూడ, ఫిబ్రవరి 1: (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో శనివారం కార్యాలయంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వస్తుందన్నారు. ఎంసీసీని అమలు చేసేందుకు పోలీస్, రెవెన్యూ, మునిసిపల్ తదితరశాఖల ఉన్నతాధికారులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వైలెన్స్ టీమ్, స్పెషల్ వీడియో టీమ్ పనిచేస్తుందన్నారు. అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ యూసుఫ్, తహసీల్దార్ హరిబాబు పాల్గొన్నారు.

● ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని ఫిర్యాదుదారులు గమనించాలని కోరారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి : భగత్



మినీ స్టేడియాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నాగార్జునసాగర్ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. హాలియా పట్టణంలోని మినీ స్టేడియం అభివృద్ధి పనులు అసంపూర్తిగా వదిలేయడంతో శనివారం మినీస్టేడియాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై ఎమ్మెల్యే తప్పుడు ప్రచారం, అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. హాలియా, నందికొండ మునిసిపాలిటీల్లో ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం అమృత్ పథకం కింద రూ.59కోట్ల రూపాయలు మంజూరు చేయించినట్లు తెలిపారు. హాలియా మునిసిపాలిటీకి రూ.15 కోట్లు, నందికొండకు రూ.44కోట్లు కేటాయించినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయించి ఆగిపోయిన పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సాదం సంపత్‌కుమార్, వడ్డే సతీష్‌రెడ్డి, కూరాకుల వెంకటేశ్వర్లు, నల్లగొండ సుధాకర్, సురభి రాంబాబు, సైదాచారి, బందిలి సైదులు, రావుల లింగయ్య, మాలే ధర్మారెడ్డి, ఆంజనేయులు, జానకిరాములు, యడవల్లి నాగరాజు, ఎల్లయ్య, మల్లేష్, నగేష్, వంశీ, అజయ్, భాస్కర్, సాయికుమార్, మహేష్, శ్రవణ్, శివ, సతీష్ పాల్గొన్నారు.

● హాలియాకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొనాల శివయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే భగత్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సహనంతోనే ఉన్నత స్థాయికి మార్గం : జానా



చంద్రబోస్ సూక్తిని చూపుతున్న సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి

నల్లగొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సహనం ఉన్న నాయకులే దేశాన్ని ఉన్నతంగా నిలబెడతారని మాజీ మంత్రి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి చెప్పారు. శనివారం నాగార్జునసాగర్ లోని నివాసంలో ఆయన్ని కలవడానికి వచ్చిన నాయకులతో పిచ్చాపాటి మాట్లాడుతూ జానారెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. మంచి నాయకుడు అధికారంతో కాదు ఐకమత్యంతో సమాజాన్ని ముందుకు నడిపిస్తాడని, ప్రజలకు తిండి, చదువు అందుబాటులో ఉన్నప్పుడే రాజకీయాలకు అర్థం ఉంటుందన్నారు. రాజకీయాల్లో ఉండే ప్రతి నాయకుడూ దీన్ని నిత్యం మననంలో ఉంచుకుని నడుచుకుంటే ఆ నాయకుడిని జనం గుర్తుంచుకుంటారని హితవు పలికారు. ఈ వ్యాఖ్యలు చేయడమే కాదు నేతాజీ సుభాష్ చంద్రబోస్ సూక్తిని ఆయన జిరాక్స్ తీయించి మరీ ప్రదర్శించి వివరిస్తున్నారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

హాలియా, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఫీజు రియంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని సృజన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జూలకంటి అప్పారెడ్డి కోరారు. శనివారం ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మూడు సంవత్సరాల ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో యాజమాన్యాలు దిక్కుతోచని పరిస్థితుల్లో కళాశాలలు నిర్వహించలేకపోతున్నామన్నారు. అటు విద్యార్థుల భవిష్యత్తు, కళాశాలల యాజమాన్యాల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఫీజు రీయింబర్‌మెంట్‌ను విడుదల చేసే విధంగా చూడాలని వినతి పత్రంలో కోరారు. ఆయన వెంట అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

వైభవంగా భోగ్‌బండార్ హోమం

- **పెద్ద పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి**



భోగ్‌బండార్‌లో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

పెద్దవూర, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊరబావితండా వద్ద వెలసిన కిచ్యాసాద్ పెద్ద పూజ కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఊరబాయితండా, బెట్టెలతండా, పూల్యతండా, మల్లెవానికుంటతండా, నిమ్మానాయక్‌తండాలో గిరిజనులు నిర్వహించే భోగ్‌బండార్ కార్యక్రమంలో హోమం నిర్వహించారు. దండోరా వాయించి పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు యాదగిరిగౌడ్, తులసీరాం, హనుమంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



స్టాక్ రూంలో సామగ్రిని పరిశీలిస్తున్న సరిత

చింతపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని జీసీడీ సరిత అన్నారు. శనివారం చింతపల్లి మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహార విషయంలో విద్యార్థులకు రుచికరమైన పదార్థాలను అందించాలని ఆమె సూచించారు. నాణ్యమైన విద్యనందదించి ఉత్తమ ఫలితాల సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

దేవరకొండ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వడ్డెరులను ఎస్టీజాబితాలో చేర్చాలని వడ్డెర సంక్షేమసంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు ఇరగదిండ్ల కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. దేవరకొండ పట్టణంలోని కోదండరామాలయంలో శనివారం నిర్వహించిన వడ్డెర సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వడ్డెరులకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రేషన్‌కార్డులు పంపిణీ చేయాలన్నారు. కులవృత్తిని నమ్ముకొని పనిచేస్తున్న వడ్డెర కార్మికులకు ప్రభుత్వం రుణాలు అందజేసి ఆదుకోవాలన్నారు. అనంతరం వడ్డెర సంక్షేమసంఘం పట్టణ అధ్యక్షుడిగా వరికుప్పల శ్రీనివాసును ఎంపిక చేశారు. సమావేశంలో వడ్డెరసంఘం నాయకులు నిరంజన్, శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన దినోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని మేఘ్యాతండా గ్రామంలో ఆరోగ్యసిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ చర్మంపై స్పర్శ కోల్పోయిన మచ్చలు ఉంటే వాటిని తాకినప్పుడు, ఒత్తినప్పుడు స్పర్శ తెలియకపోతే కుష్ఠు వ్యాధి కావచ్చని అన్నారు. ఆ లక్షణాలు ఉంటే ఆస్పత్రికి వెళ్తే వైద్యులు చికిత్స అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్.మౌనిక, ఏఎన్‌ఎం సరిత, ఆశా పి.పద్మ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు అల్పాహారం

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఫిబ్రవరి 1 నుంచి మార్చి 20వ తేదీ వరకు పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎం. జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అశోక్‌రెడ్డి, సుధాకర్, ప్రభావతి, శ్రీకాంత్‌రెడ్డి, జగదీశ్వర్, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.




వైభవంగా మార్కెండేయస్వామి జయంతి

దేవరకొండ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని శ్రీభక్త మార్కండేయస్వామి దేవాలయంలో శనివారం మార్కండేయస్వామి, శ్రీభవాని మృత్యుంజయస్వాములకు ప్రత్యేక పుష్పాభిషేకాలు నిర్వహించారు. భక్తమార్కెండేయస్వామి జయంతిని పురస్కరించుకొని మార్కండేయస్వామి దేవాలయంలో భగవద్గీత పారాయణం, లక్ష్మీ అష్టోత్తరం, విష్ణు సహస్రనామ పారాయణం, మృత్యుంజయేశ్వర రుద్రహోమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు వనం జగదీశ్వర్, మణిదీప్, ఎల్లయ్య, నీల పాండరయ్య, గాజుల ఆంజనేయులు, గాజుల మురళి, అంకం చంద్రమౌళి, సత్యనారాయణ, వినయ్ పాల్గొన్నారు.

● చింతపల్లి: మండలంలోని వెంకటేశ్వరనగర్ శివాలయంలో ఈ నెల 3న నిర్వహించే మార్కండేయ జయంతికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో విద్యుత్ లైట్లు అలంకరించి ఆలయాన్ని సుందర మనోహరంగా తీర్చిదిద్దారు. భక్తులు సకాలంలో పాల్గొని మొక్కులు తీర్చుకోవాలని ఆలయ ప్రధాన పూజారి కులకర్ణిమంజునాథ్ శర్మ తెలిపారు.



మార్కండేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కమిటీ నిర్వాహకులు, భక్తులు



ఎమ్మెల్సీ కోదండరాంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిగ్రీ, పీజీ అధ్యాపకులు

కళాశాల యాజమాన్యాల సమస్యలు పరిష్కరించాలి

- **ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం**

మిర్యాలగూడటౌన్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కళాశాలల యాజమాన్యాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం అందజేసినట్లు విజేత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల దనుంజయ్ తెలిపారు. డిగ్రీ, పీజీ విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కళాశాలల నిర్వహణ కష్టతరంగా మారిందన్నారు. విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే విద్యాలయాలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బకాయిలు వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని రాజధానిలో ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి, సమస్యలు వివరించి పుష్పగుచ్ఛం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగయ్య, హరి, దుర్గయ్య, బాలాజీ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పేదలు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. పెద్దవూర మండలకేంద్రానికి చెందిన బొడ్డుపల్లి సతీష్‌కు మంజూరైన రూ.42వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం తిరుమలగిరి(సాగర్) మండలంలోని బోయగూడెం గ్రామంలో ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో ఎంసీకేఆర్ యువసేన నాయకులు రవీంద్రచారి, రమేష్, మల్లి, హరిబాబు, పుల్లం రాజు, శ్రీను పాల్గొన్నారు.

బీసీ రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలి

పెద్దవూర, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఆదివారం నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలని బీసీ సమాజ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్ అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా చూస్తున్నాయే తప్ప వారి ఆర్థిక, రాజకీయ, సామాజిక ఎదుగుదలకు కృషి చేయడం లేదన్నారు. వరంగల్‌లో ఆదివారం నిర్వహించే బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు ప్రతి ఒక్క బీసీ తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కట్టెబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, అయితగోని వెంకటయ్య, బుడిగపాక సత్యనారాయణ, జిల్లా కొండలు, కాసుల అజయ్, నాగయాదవ్, కొమ్మగోని నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత అభినందనీయం

నిడమనూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమని ఎంఈవో లావూరి వెంకన్న అన్నారు. మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి అందజేసి మాట్లాడారు. పరీక్ష సామగ్రిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. సామగ్రి అందజేసిన క్లబ్ నిర్వాహకులను అభినందించారు. విద్యార్థులు కూడా లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పోలే డేవిడ్, ప్రధాన కార్యదర్శి చిత్రం అశోక్, హైస్కూల్ హెడ్మాస్టర్ గౌతమ్, పాంపాటి శ్రీనివాసులు, మధు, అశోక్, సత్తిబాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.